E KABURU - Digital News Paper

E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 01-04-2026 (వారం) బుధవారం సంపుటి: 02 || సంచిక:89

www.ekaburu.com

## ఉన్నపళంగా ఉరిమిన వాన



03



# దద్దరిల్లిన ఇస్ఫహాన్

- ఇరాన్‌లో అణుకేంద్రం, ఆయుధ నిల్వలున్న ప్రాంతంపై బంకర్ బస్టర్లతో విరుచుకుపడిన అమెరికా
- కువైట్ చమురు ట్యాంకర్‌పై ఇరాన్ ప్రతి దాడి
- మరింత ఉగ్రరూపం దాల్చిన పశ్చిమాసియా
- శాంతి ప్రణాళిక రూపొందించిన చైనా, పాక్

ఈకబురు, :దుబాయ్, : పశ్చిమాసియా దద్దరిల్లుతోంది. ఇరాన్ ప్రధాన అణుక్షేత్రాలున్న ఇస్ఫహాన్‌పై అమెరికా మంగళవారం భారీగా దాడులు చేసింది. దీంతో ఆకాశంలో భారీ అగ్నిగోళం కనిపించింది. ఇస్ఫహాన్‌లో ఆయుధ నిల్వలున్న ఓ డిపోపై 2వేల పౌండ్ల బంకర్ బస్టర్‌లతో అగ్రరాజ్యం దాడి చేసింది. దీంతో అక్కడ భారీగా మంటలు చెలరేగాయి. అటు పర్షియన్ గల్ఫ్‌లో కువైట్ చమురు ట్యాంకర్‌పై ఇరాన్ దాడికి పాల్పడింది. తమకు సహకరించని దేశాలు సొంతంగా చమురు ఏర్పాట్లు చేసుకోవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హూంకరించారు. మరోపక్క కాస్త ముందుగానే యుద్ధాన్ని ఆయన ఆపేస్తారని సంకేతాలు వెలువడుతున్నాయి. తాజా దాడి వీడియోను 'ట్రూత్ సోషల్'లో ట్రంప్ పోస్టు చేశారు. మరోవైపు పశ్చిమాసియాలో శాంతికి వీలుగా దాడుల్ని తక్షణం ఆపాలని చైనా, పాకిస్థాన్ ప్రతిపాదించాయి.

**అగ్రరాజ్యానికి షాకిస్తున్న దేశాలు**

ఇరాన్‌పై యుద్ధం కొనసాగిస్తోన్న అమెరికాకు కొన్ని దేశాలు షాక్ ఇస్తున్నాయి. యుద్ధంలో పాల్గొనే అమెరికా విమానాలకు తమ గగనతలాన్ని మూసివేయడానికి ఇటలీ చర్యలు తీసుకుంటున్నట్లు ప్రసార మాధ్యమాలు వెల్లడించాయి. ఇటీవల స్పెయిన్ సైతం ఇదే తరహా ప్రకటన చేసింది. ఇరాన్‌పై దాడుల్లో జోక్యం చేసుకోవడానికి ఈయూ దేశాలు ఇష్టపడటం లేదు. సిసిలీలోని తమ కీలక వైమానిక స్థావరాన్ని అమెరికా విమానాలు ఉపయోగించుకోవడానికి అనుమతి నిరాకరిస్తున్నట్లు ఇటలీ ప్రకటించింది. పశ్చిమాసియాకు వెళ్లే ముందు సిసిలీలోని వైమానిక స్థావరంలో బాంబర్ విమానాలను నిలపడానికి ఇటలీ అనుమతిని అమెరికా కోరినట్లు మీడియా వర్గాలు వెల్లడించాయి.

**హర్మూజ్ తెరవకుండానే యుద్ధ ముగింపునకు ట్రంప్ సిద్ధం!**

ఇరాన్‌తో యుద్ధంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు 'వాల్‌స్ట్రీట్ జర్నల్' కథనాన్ని ప్రచురించింది. హర్మూజ్ జలసంధిని పూర్తిగా తిరిగి తెరవకపోయినా, ప్రస్తుత సైనిక చర్యలను ముగించేందుకు ఆయన సిద్ధంగా ఉన్నారని అమెరికా అధికారుల్ని ఉటంకిస్తూ వెల్లడించింది.
హర్మూజ్‌ను బలవంతంగా తెరిపించే ప్రక్రియకు తాము అనుకున్న 4 నుంచి 6 వారాల గడువు కంటే ఎక్కువ సమయమే తీసుకుంటుందని అమెరికా అంచనా వేసిందని తెలిపింది. ఇప్పటికే 30వ రోజుకు చేరుకున్న యుద్ధాన్ని మరింత పొడిగించకుండా ముగించాలని యోచిస్తున్నట్లుగా పేర్కొంది.

మిగతా 2లో

## మానవత్వం చాటుకున్న సీఎం రేవంత్ రెడ్డి

.. ట్యాంక్ బండ్ శివ కుటుంబానికి కొండంత అండ

**ఈ కబురు , హైదరాబాద్ ;**

జుబ్లీహిల్స్ లోని ముఖ్యమంత్రి నివాసంలో ఒక అద్భుతమైన సన్నివేశం చోటుచేసుకుంది. ట్యాంక్ బండ్ పై వందలాది మంది ప్రాణాలను కాపాడి రియల్ హీరోగా గుర్తింపు తెచ్చుకున్న శివ దీన స్థితిని తెలుసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించారు.



02



## కాంగ్రెస్.. రాజకీయ రాబందు

**పశ్చిమాసియా పరిణామాలపై రాజకీయ లబ్ధి కోసం పాకులాట**
**వదంతులతో ప్రజల్లో భయాందోళనల సృష్టి: మోదీ**

ఈకబురు, :థరాడ్/గాంధీనగర్: కాంగ్రెస్ పార్టీ రాజకీయ రాబందులా వ్యవహరిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ మండిపడ్డారు. రాజకీయ లబ్ధి కోసం ప్రజల్లో భయాందోళనలు సృష్టించడానికి పశ్చిమాసియా పరిణామాలను వాడుకుంటోందని మండిపడ్డారు. ఆ ఉద్రిక్తతలు మనపై ప్రభావం చూపకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వివరించారు. మంగళవారం గుజరాత్‌లోని వావ్ థరాడ్ జిల్లా నానీ గ్రామంలో మోదీ పర్యటించారు. రూ.19,806 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభించారు. ఖేడ్‌బ్రహ్మ–హిమ్మత్‌నగర్–అసర్వా రైలుకు పచ్చజెండా ఊపారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మోదీ ప్రసంగించారు. "కాంగ్రెస్ పుకార్లు వ్యాప్తి చేస్తోంది.

మిగతా 2లో

## వచ్చే మూడేళ్లలో మహిళా సంఘాలకు రూ.లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు


**మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుపై ప్రజల అభిప్రాయాల సేకరణ**

ఈకబురు, :హైదరాబాద్: ప్రజలకిచ్చిన హామీలన్నింటినీ ఎన్ని సవాళ్లు ఎదురైనా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసి చూపుతుందని, దానికి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ పథకమే నిదర్శనమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ వసతి మొదలైన తర్వాత జీరో టికెట్ల మొత్తం రూ.10 వేల కోట్ల మైలురాయిని చేరుకున్న నేపథ్యంలో మంగళవారం సాయంత్రం ప్రజాభవన్‌లో మహిళా సంఘాల సభ్యులతో ప్రభుత్వం అభినందన సభ ఏర్పాటు చేసింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు దీరిన వెంటనే, బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణ వసతి పథకాన్ని ప్రారంభించిందని, దాని రూపంలో ఇప్పటి వరకు 290 కోట్ల ప్రయాణాలతో



మహిళలు ఆదా చేసుకున్న మొత్తం రూ.10 వేల కోట్లకు చేరుకోగా, అంతేమొత్తాన్ని ఆర్టీసీకి ప్రభుత్వం అందజేసి దాన్ని ఆదుకుందని తెలిపారు. వచ్చే మూడేళ్లలో మహిళా సంఘాలకు రూ.లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చే దిశగా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని, వీలైతే ఈ మొత్తాన్ని రూ.లక్షన్నర కోట్లకు చేరుస్తామని ప్రకటించారు.

మిగతా 2లో



6

## గెలుపు పంజా విసిరిన పంజాబ్..

గుజరాత్ టైటాన్స్‌తో మ్యాచ్‌లో 163 పరుగుల విజయలక్ష్యం.... పంజాబ్ ఒకదశలో 11 ఓవర్లలో 110/2... మిగిలిన 48 బంతుల్లో మరో 53 పరుగులు అంటే అలవోకగా ఛేదించవచ్చు... కానీ ఇక్కడ జట్టు అనూహ్యంగా తడబడింది. 16 బంతుల వ్యవధిలో జట్టు 4 వికెట్లు కోల్పోవడంతో ఒక్కసారిగా ఉత్కంఠ పెరిగింది. అయితే ఈ మ్యాచ్‌తోనే ఐపీఎల్‌లో అరంగేట్రం చేసిన ఆస్ట్రేలియన్ కూపర్ కనోలీ పట్టుదలగా నిలబడ్డాడు. ఒత్తిడిని అధిగమిస్తూ చివరి వరకు నిలబడి ఒంటి చేత్తో గెలిపించాడు. అంతకుముందు పంజాబ్ పదునైన బౌలింగ్ ముందు నిలవలేక గుజరాత్ సాధారణ స్కోరుకే పరిమితమైంది.



2

## ఎల్‌డీఎఫ్ గెలుపునకు మోదీ ప్రయత్నం

ఈ-కబురు,

ఈ కబురు,కన్నూర్ : కేరళలో లెఫ్ట్, భాజపా కలిసి పని చేస్తున్నాయని, ఎల్‌డీఎఫ్ గెలవాలని ప్రధాని మోదీ కోరుకుంటున్నారని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఆరోపించారు.

## టోల్ ఇక్కడ తగ్గింది.. అక్కడ పెరిగింది



- పంతంగి, కొర్లపహాడ్, చిల్లకల్లు ప్లాజాల వద్ద రూ. 5 తగ్గింపు
- హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారిపై ఆయా
- వాహనాలను బట్టి రూ. 5 నుంచి రూ. 20 వరకు పెంపు
- జనగామ–సూర్యాపేట రహదారిలో సింగరాజుపల్లి
- ప్లాజా వద్ద రూ. 5 నుంచి రూ 10 పెంపు

ఈకబురు, : హైదరాబాద్-విజయవాడ రూట్‌లో టోల్ చార్జీలు స్వల్పంగా తగ్గగా, హైదరాబాద్-వరంగల్, జనగామ-సూర్యాపేట రూట్‌లో స్వల్పంగా పెరిగాయి. తగ్గిన, పెరిగిన ధరలు బుధవారం నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ మేరకు ఎన్‌హెచ్ఏఐ ఆదేశాలు జారీ చేసింది. హైదరాబాద్-విజయవాడ రూట్‌లో టోల్ చార్జీలు తగ్గడంతో యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి, సూర్యాపేట జిల్లా కేతేపల్లి మండలం కొర్లపహాడ్, ఏపీలోని ఇబ్రహీంపట్నం మండలం చిల్లకల్లు టోల్‌ప్లాజాల మీదుగా ప్రయాణించే వాహనదారులకు ప్రయోజనం చేకూరనుంది. అయితే ఈ ధరలు కూడా ఒక టోల్‌ప్లాజా వద్ద తగ్గితే మరో టోల్‌ప్లాజా వద్ద యథావిధిగా ఉన్నాయి.

మిగతా 2లో

## చర్చించకుండా పారిపోయారు



**ఈ-కబురు, :హైదరాబాద్:**

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం సభా సాంప్రదాయాలను తుంగలో తొక్కిందని శాసనసభలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ టి. హరీశ్‌రావు ఆగ్ర హం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై ప్రతిపక్షాలు అడిగిన ప్రశ్నలకు సూటిగా సమాధానం చెప్పకుండా సీఎం రేవంత్‌రెడ్డి తొండలు, కండల భాష వాడారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం ఆత్మరక్షణలో పడిన ప్రతీసారి ప్రతిపక్షంపై ఎదురుదాడి చేస్తూ గత ప్రభుత్వంపై విమర్శలు చేస్తోందన్నారు.

మిగతా 2లో

## మేడ్ ఇన్ అమరావతి
## క్వాంటం హార్డ్ వేర్ లక్ష్యం




క్వాంటం అప్లికేషన్లతో ఏపీకే తొలి ప్రయోజనాలు

ఏప్రిల్ 14న దేశంలోనే తొలి ఓపెన్ క్వాంటం కంప్యూటర్ రాజధానిలో ప్రారంభం

క్వాంటం హార్డ్ వేర్ మాన్యుఫాక్చరింగ్ ఎకో సిస్టం రౌండ్ టేబుల్ సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు

**ఈ కబురు, అమరావతి :-**

రాజధాని అమరావతిలో ఏర్పాటు చేస్తున్న క్వాంటం కంప్యూటింగ్ వ్యాలీ దేశానికి ఓ నూతన దిశను అందిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. జాతీయ క్వాంటం మిషన్ లక్ష్యాలను తొలిగా అందిపుచ్చుకుని ఏర్పాటు చేసిన అమరావతి క్వాంటం వ్యాలీ దేశానికి ప్రగతి ప్రేరకంగా మారుతుందని అన్నారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన అమరావతి క్వాంటం వ్యాలీ క్వాంటం హార్డ్ వేర్ మాన్యుఫాక్చరింగ్ ఎకోసిస్టమ్ పై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్యమంత్రి హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి నేషనల్ క్వాంటం మిషన్ డైరెక్టర్ జేబీవీ రెడ్డి, స్టేట్ క్వాంటం మిషన్ డైరెక్టర్ సీవీ శ్రీధర్, ఐబీఎం డైరెక్టర్ అమిత్ సింఘీ, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు సీడాక్, సీడాట్, డీఆర్ డీఓ, నేవల్ సైన్స్ టెక్నాలాజికల్ లేబొరేటరీ, బార్క్ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు.

మిగతా 3లో

# యుద్ధానికి త్వరలో తెర!

**సన్నిహితులతో ట్రంప్ వ్యాఖ్యలు?**
**హార్మూజ్ నుంచి చమురు తెచ్చుకోండి**
**నాటో దేశాలపై అధ్యక్షుని ఆగ్రహం**

ఈకబురు, వాషింగ్టన్: ఇంటా బయటా తీవ్ర వ్యతిరేకత నేపథ్యంలో ఇరాన్‌పై యుద్ధానికి వీలైనంత త్వరగా తెర దించేందుకే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొగ్గు చూపుతున్నట్టు సమాచారం. తన సన్నిహితులతో ఆయన తాజాగా ఈ మేరకు పేర్కొన్నట్టు వాల్‌స్ట్రీట్ జర్నల్ నివేదించింది. ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన హార్మూజ్ జలసంధిని ఇరాన్ తక్షణం తెరవాల్సిందేనని కొన్నాళ్లుగా అధ్యక్షుడు పట్టుబడుతుండటం తెలిసిందే. దాన్ని తెరిచినా, తెరవకపోయినా యుద్ధాన్ని మాత్రం ముగించేస్తానని ఆయన చెబుతున్నట్టు ఆ వార్తా సంస్థ తెలిపింది.


"యుద్ధాన్ని నాలుగు నుంచి ఆరు వారాలు మాత్రమే సాగించాలని ముందే నిర్ణయించుకున్నాం. హర్మూజ్ కోసం పట్టుబడితే పోరు మరిన్ని రోజులు కొనసాగేలా ఉంది. కనుక మన ప్రధాన లక్ష్యాలైన ఇరాన్ నావికా దళాన్ని, దాని క్షిపణి నిల్వలను పూర్తిగా నేలమట్టం చేసి యుద్ధానికి త్వరగా తెర దించేస్తా'' అని ట్రంప్ చెప్పుకొచ్చినట్టు పేర్కొంది. మరోవైపు సౌదీ, యూఏఈ, బహ్రెయిన్, కువైట్ వంటి గల్ఫ్ దేశాలు మాత్రం ఇరాన్ పూర్తిగా ఓడేదాకా యుద్ధాన్ని కొనసాగించాల్సిందిగా అమెరికాను కోరుతున్నట్టు అసోసియేటెడ్ ప్రెస్ పేర్కొంది!

మిగతా 2లో



## గూర్ఖాలాండ్ నినాదం కనుమరుగు?

ఎన్నికల్లో ఇతర అంశాలపై మళ్లిన ప్రజల ఆలోచన
రోడ్లు, పర్యాటకం, నీరు, విద్య, వైద్యంపై దృష్టి



03

# కాంగ్రెస్.. రాజకీయ రాబందు



ప్రజలు పెట్రోల్ బంకుల వద్ద, గ్యాస్ ఏజెన్సీ ముందు క్యూ కట్టేలా చేస్తోంది. కాంగ్రెస్ నేతలు విచ్ఛిన్న రాజకీయాల్లో నిమగ్నమయ్యారు. పరిస్థితులు అదుపు తప్పితే దాన్ని రాజకీయ లబ్ధి కోసం వాడుకోవడానికి కాంగ్రెస్ కాచుకొని ఉంది'' అని దుయ్యబట్టారు.

ఇంధన భారం పడకుండా చర్యలు

పలు దేశాలు యుద్ధం, అశాంతి, అస్థిరతలో కూరుకుని ఉంటే భారత్ మాత్రం సుస్థిరత, ఐక్యతను ప్రదర్శిస్తోందని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. పశ్చిమాసియా యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఇంధనం కొరత పెరిగిందని గుర్తుచేశారు. ఇంతటి సంక్షోభంలోనూ మన బలమైన విదేశాంగ విధానం, పౌరుల సమష్టి కృషితో ప్రతికూల పరిస్థితిని విజయవంతంగా నియంత్రిస్తున్నామని తెలిపారు. యుద్ధం వల్ల ప్రపంచమంతటా ఇంధనం ధరలు 10 నుంచి 15 శాతం పెరిగాయన్నారు. ఈ భారం మన ప్రజలపై పడకుండా చర్యల చేపటినట్లు వెల్లడించారు.

శాంతి, అహింస సందేశం

ప్రపంచ అస్థిరత, అశాంతి మంటల్లో చిక్కుకున్న నేటి తరుణంలో సామ్రాట్ సంప్రాతి మ్యూజియం శాంతి, అహింస సందేశాన్ని ఇస్తోందని ప్రధాని మోదీ అన్నారు. గుజరాత్ రాజధాని గాంధీ నగర్ సమీపంలో శ్రీమహావీర్ జైన్ ఆరాధన కేంద్రం ప్రాంగణంలో నిర్మించిన ఈ మ్యూజియాన్ని ఆయన ప్రారంభించారు. ఈ మ్యూజియం వారసత్వం, సందేశం మన దేశానికే కాకుండా మొత్తం మానవాళికి ఎంతో ఉపయోగకరమని చెప్పారు.

**విశ్వసనీయ సరఫరాదారు భారత్**

గుజరాత్‌లోని సనంద్‌లో కేనెస్ సెమీకాన్ కంపెనీ ఆధ్వర్యంలోని సెమీకండక్టర్ ప్లాంట్‌ను మోదీ ప్రారంభించారు. సెమీకండక్టర్లలో మనదేశం విశ్వసనీయ సరఫరాదారుగా మారిందని చెప్పారు. ''21వ శతాబ్దం పలు సవాళ్లు తెచ్చింది. సంఘర్షణల వల్ల ప్రపంచ సప్లై చైన్లు ప్రభావితమయ్యాయి. రాబోయే దశాబ్దాల్లో సాంకేతికత, ఇంధన భద్రతకు మా ప్రభుత్వం బలమైన పునాది వేస్తోంది'' అని వివరించారు.

# చర్చించకుండా పారిపోయారు




ప్రతిపక్ష పాత్రను బీఆర్ఎస్ సమర్థవంతంగా నిర్వహిస్తుంటే కాంగ్రెస్ తట్టుకోలేకపోతున్నదన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద్, డాక్టర్ సంజయ్, బండారి లక్ష్మారెడ్డి, విజయుడు, పాడి కౌశిక్‌రెడ్డితో కలిసి అసెంబ్లీ మీడియా హాల్‌లో మంగళవారం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. శాసనసభ బడ్జెట్ సమావేశాలు ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత సహాఅనేక అంశాలపై ఎలాంటి దిశా నిర్దేశం లేకుండానే ముగిశాయన్నారు. బడ్జెట్, బిల్లులను ఆమోదించుకోవాలనే రాజ్యాంగ అనివార్యత వల్లే సభను తూతూ మంత్రంగా నడిపారన్నారు. 19 అంశాలపై బీఆర్ఎస్ స్వల్పకాలిక చర్చల కోసం నోటీసులు ఇచ్చినా ప్రభుత్వం ముందుకు రాలేదని, ప్రశ్నోత్తరాల్లో బీఆర్ఎస్ లేవనెత్తిన ప్రశ్నలు చర్చకు రాకుండా సాగదీత ధోరణిలో సభ జరిగిందన్నారు. సీఎం ఢిల్లీ పర్యటనలు, డిప్యూటీ సీఎం సన్నద్ధత పేరిట, విరామం పేరిట గంటల కొద్దీ సభ వాయిదా వేశారని, కేరళ ఎన్నికల కోసం అసెంబ్లీ సమావేశాలను 30వ తేదీన హడావుడిగా ముగించారని హరీశ్‌రావు మండిపడ్డారు.

అవినీతి మంత్రిని కాపాడేందుకు డైవర్షన్

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అవినీతిని సాక్ష్యాధారాలతో సహా సభలో బయట పెడితే డైవర్షన్ రాజకీయాలు చేశారని హరీశ్‌రావు మండిపడ్డారు. అవినీతి మంత్రిని కాపాడేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను రెండు రోజుల పాటు సస్పెండ్ చేసి బిల్లులు, పద్దులు ఆమోదించుకున్నారన్నారు. కత్తుల కోలాటం ఆడుతాం.. తలలు తీస్తాం.. సామాజిక బహిష్కరణ చేస్తాం.. అంటూ కాంగ్రెస్ సభ్యుల మాటలను సీఎం పక్కన కూర్చుని ప్రోత్సహించారన్నారు.

ఎమ్మెల్యేల వ్యాఖ్యలతో పాటు రేవంత్ రెండేండ్లుగా సభలో వాడుతున్న భాషను కూడా ఎథిక్స్ కమిటీకి రిఫర్ చేయాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వమే అన్ని అనుమతులు ఇచ్చినా రూ.లక్ష కోట్లు కొట్టుకు పోయాయని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ పార్లమెంటులో కామెంట్లు చేస్తున్నారని, కేంద్ర మంత్రి వ్యాఖ్యలు అచ్చం రేవంత్ మాటల తరహాలోనే ఉండడం కాంగ్రెస్, బీజేపీ నడుమ ఉన్న ఫెవికాల్ బంధానికి నిదర్శనమన్నారు.

# మానవత్వం చాటుకున్న సీఎం రేవంత్ రెడ్డి



ప్రాణాలకు తెగించి ఇతరులను కాపాడే శివ ప్రస్తుతం ఉపాధి లేక కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతున్నారనే వార్త సీఎం దృష్టికి వెళ్లింది. సామాన్యుల కష్టాలను తీర్చడమే లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం శివను పిలిపించి మాట్లాడింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా శివ కుటుంబ సభ్యులతో ముచ్చటించారు. వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శివ కుటుంబానికి రూ. 5 లక్షల ఆర్థిక సాయాన్ని ప్రకటించడమే కాకుండా.. తక్షణమే చెక్కును అందజేశారు. శివ సేవలను గుర్తించిన ప్రభుత్వం అతని కుమారుడు వేణుమాధవ్‌కు హోంగార్డుగా ఉద్యోగం కల్పించింది. ఇందుకు సంబంధించిన నియామక పత్రాన్ని ముఖ్యమంత్రి స్వయంగా యువకుడికి అందజేసి అభినందించారు. శివ నివసించడానికి సరైన ఇల్లు లేదని తెలుసుకున్న రేవంత్ రెడ్డి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. శివ కుటుంబానికి ఒక డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలని స్పష్టం చేశారు. కేవలం ఆర్థిక సాయంతోనే ఆగిపోకుండా భవిష్యత్తులో శివ గౌరవప్రదంగా జీవించేలా మార్గం సుగమం చేశారు. తన నైపుణ్యాన్ని సమాజ సేవకు వాడుతున్న శివ.. తనకు ఉపాధి కోసం ట్యాంక్ బండ్ సమీపంలో ఒక స్విమ్మింగ్ పూల్ నిర్మించి ఇవ్వాలని సీఎంను కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శివ ద్వారా మరికొంత మంది యువకులకు ఈత నేర్పించి వారిని కూడా ప్రాణరక్షకులుగా తీర్చిదిద్దే అవకాశం ఉంటుందని సీఎం అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం అందించిన ఈ భారీ ఊరట పట్ల శివ కుటుంబ సభ్యులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. తమ కష్టాలను గుర్తించి ఆదుకున్న ముఖ్యమంత్రికి శివ కృతజ్ఞతలు తెలిపారు. ఇన్నేళ్ల సేవకు ఇన్నాళ్లకు తగిన గుర్తింపు లభించిందని భావోద్వేగానికి లోనయ్యారు. ఒక సామాన్యుడి ఆవేదనను ఆలకించి అండగా నిలిచిన ముఖ్యమంత్రి తీరును పలువురు ప్రశంసిస్తున్నారు. ఆపదలో ఉన్నవారిని కాపాడే గుణం ఉన్న శివకు ఈ సాయం ఎంతో అవసరమని జనం చర్చించుకుంటున్నారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల శివ కుటుంబానికి శాశ్వత నివాసంతో పాటు స్థిరమైన ఉపాధి మార్గం దొరికింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయం ప్రజా ప్రభుత్వం పేదలకు ఏ విధంగా తోడ్పడుతుందో నిరూపించింది. అధికారులు సైతం సీఎం ఆదేశాలతో వెంటనే రంగంలోకి దిగి తదుపరి ప్రక్రియను వేగవంతం చేశారు.

# వచ్చే మూడేళ్లలో మహిళా సంఘాలకు రూ.లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు

ఈ లక్ష్య సాధనలో సంవత్సరానికి రూ.20 వేల కోట్లు ఇచ్చే దిశలో ఇప్పటికే రూ.57 వేల కోట్లను అందజేసినట్లు వెల్లడించారు. వాటిపై ప్రభుత్వం వడ్డీ భరిస్తూ రూ.1329 కోట్లను చెల్లించిందని, తాజా బడ్జెట్‌లో వడ్డీ కోసం రూ.రెండున్నర వేల కోట్లను ప్రతిపాదించిందని, ఐదేళ్లలో రూ.10 వేల కోట్లను ప్రభుత్వం వడ్డీ మొత్తాన్ని భరిస్తుందని తెలిపారు. ఆర్టీసీకి బకాయిల భారమున్నా మహాలక్ష్మి పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నామని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం, కార్మిక సంఘాల పునరుద్ధరణ అంశాలు తప్ప సంస్థకు సంబంధించిన ఆర్థికపరమైన అంశాలను కొలిక్కి తెస్తున్నట్లు వెల్లడించారు. ఉచిత ప్రయాణ పథకాన్ని విమర్శించే వారికి, ఆ పథకం ద్వారా లబ్ధి పొందుతున్న మహిళలే తిరుగుబాటు ద్వారా సమాధానం చెప్పాలని మంత్రి సీతక్క సూచించారు. ఈ సందర్భంగా ఉచిత ప్రయాణ వసతికి సంబంధించి రూ.10 వేల కోట్ల మొత్తాన్ని ఆర్టీసీకి రీయింబర్స్ చేయడానికి గుర్తుగా రూ.10,000 కోట్ల మెగా చెక్కును మంత్రులు ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మాలోతు రాందాస్, ప్రేమ్‌సాగర్ రావు, మాజీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, సెర్ప్ సీఈవో దివ్య, హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన, ఆర్టీసీ ఈడీలు సీహెచ్.వెంకన్న, ఖుస్రో షా ఖాన్, రాజశేఖర్, పద్మశ్రీ పురస్కార గ్రహీత సునీతాకృష్ణన్ పలువురు సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుపై ప్రజల అభిప్రాయాల సేకరణ

మూసీ పునరుజ్జీవంపై ప్రజల అభిప్రాయాలు స్వీకరించాలని కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది. నేటి నుంచి ఏప్రిల్ 15 వరకు సలహాలు స్వీకరించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నంతో కూడిన కమిటీ నిర్ణయించింది. musirrdc@gmail.comకు అభిప్రాయాలు పంపాలని కేబినెట్ సబ్ కమిటీ కోరింది.



# దద్దరిల్లిన ఇస్ఫహాన్



ఇరాన్ నౌకాదళం, క్షిపణి నిల్వలను బలహీనపరచడాన్ని అమెరికా ప్రధాన లక్ష్యంగా పెట్టుకుందని తెలిపింది. ఈ లక్ష్యాలు సాధించిన తర్వాత యుద్ధాన్ని తగ్గిస్తూ, దౌత్యపరంగా ఒత్తిడి తీసుకురావాలని ట్రంప్ యోచిస్తున్నారని, హర్మూజ్‌ను వెంటనే తెరవడానికి సైనిక చర్యలు చేపడితే యుద్ధం మరింత కాలం కొనసాగాల్సి వస్తుందని అమెరికా అంచనా వేసిందని చెప్పింది. అందుకే ఆ బాధ్యతను యూరప్, గల్ఫ్ దేశాలకు అప్పగించే అవకాశాన్ని పరిశీలిస్తోందని వెల్లడించింది.

**మా దగ్గర కొనండి.. లేదంటే హర్మూజ్ దాటి తెచ్చుకోండి: ట్రంప్**

ఇరాన్‌పై దాడులకు సహకరించని మిత్రదేశాలపై మండిపడిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆ దేశాల ముందు రెండు ఐచ్ఛికాలు ఉంచారు. అవి తమ నుంచి చమురును కొనుగోలు చేయాలని, లేదంటే హర్మూజ్‌ను దాటి సరకు తెచ్చుకోవాలని తెగేసి చెప్పారు. చమురు ధర పెంపుతో నిరుత్సాహపడిన దేశాలూ ఇలాగే చేయాలన్నారు. కొన్ని దేశాలు వాటిపనిని అవి చేయకపోతే వాటి అణు ఇంధన కర్మాగారాల సంగతి తాను చూడాల్సి వస్తుందని చెప్పారు. ఇజ్రాయెల్ వైపు వెళ్లాల్సిన సైనిక విమానాలను ఫ్రాన్స్ అనుమతించడం లేదని, ఇరాన్ వంటి నరహంతక దేశం విషయంలో సహాయనిరాకరణ చేస్తున్న ఆ దేశాన్ని గుర్తుపెట్టుకుంటామని హెచ్చరించారు.

మా దృష్టి యురేనియం నిల్వలపైనే: నెతన్యాహు

ఇరాన్‌పై అమెరికాతో కలిసి నిర్వహిస్తున్న ఆపరేషన్ ఇప్పటికే సగం దూరం దాటిపోయిందని, లక్ష్య సాధన దిశగా వేగంగా ముందుకు సాగుతోందని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తెలిపారు. టెహ్రాన్ వద్ద ఉన్న యురేనియం నిల్వలను స్వాధీనం చేసుకోవడంపైనే ఇప్పుడు దృష్టి సారించామని ఆయన ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఇరాన్ సైనిక, అణు, పారిశ్రామిక మౌలిక సదుపాయాలపై ఇప్పటికే కోలుకోలేని దెబ్బకొట్టామని చెప్పారు. ''వాళ్లు అణ్వాయుధాలను తయారు చేయడానికి ప్రయత్నిస్తున్నారు. వాటిని అమెరికా నగరాలపై వినియోగించే సామర్థ్యాన్ని కూడా పెంచుకుంటున్నారు. ఆ పర్యవసానాన్ని నివారించడమే యుద్ధం ముఖ్య ఉద్దేశం'' అని నెతన్యాహు స్పష్టంచేశారు. ఇరాన్ వద్ద ఉన్న యురేనియం నిల్వలను బయటకు తరలించాల్సిందేనని ట్రంప్ పేర్కొన్నట్లు స్పష్టం చేశారు. ఆపరేషన్ ఎప్పుడు ముగుస్తుందన్న విషయంపై నెతన్యాహు స్పష్టమైన సంకేతాలు ఇవ్వలేదు.

భూగర్భ కేంద్రానికి ఇరాన్ యురేనియం

తాజా దాడులకు కొద్దిసేపటి ముందే ఇరాన్ సుమారు 540 కిలోల యురేనియంను 18 కంటెయినర్లలో ఇస్ఫహాన్‌లో ఓ భూగర్భ కేంద్రానికి తరలించినట్లు ఉపగ్రహ దృశ్యాలు వెల్లడిస్తున్నాయి. తమతో ఒప్పందం కుదుర్చుకోకపోతే ఆ దేశంలో భారీ విధ్వంసాన్ని సృష్టిస్తామని ట్రంప్ హెచ్చరించారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఇక్కడ భారీఎత్తున దాడులు జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. తాజాగా దుబాయ్ తీరంలో కువైట్ చమురు ట్యాంకర్‌పై ఇరాన్ డ్రోన్ దాడి చేసింది. చెలరేగిన మంటలు కాసేపటి తర్వాత అదుపులోకి వచ్చాయి. నౌక నుంచి చమురు బయటకు రాలేదని అధికార వర్గాలు తెలిపాయి. అమెరికా తయారుచేసిన రీపర్ డ్రోన్‌ను ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థలు కూల్చివేసినట్లు తెలుస్తోంది. పశ్చిమాసియాలో ఉన్న అమెరికా బలగాలు 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' లక్ష్యాల సాధనపై ప్రధానంగా దృష్టి సారించాయని శ్వేత సౌధం పత్రికా వ్యవహారాల కార్యదర్శి కరోలిన్ లీవిట్ స్పష్టం చేశారు. భూతల దాడుల గురించి ప్రశ్నించగా, ట్రంప్ ఇప్పటివరకు అలాంటి అవకాశాన్ని పూర్తిగా ఖండించడానికి నిరాకరించారని చెప్పారు. ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో దక్షిణ లెబనాన్‌లో ఐరాస శాంతి పరిరక్షకుల్లో ముగ్గురు ప్రాణాలు కోల్పోవడంపై ఐరాస భద్రతామండలి అత్యవసరంగా సమావేశమైంది. తమ దేశానికి చెందిన మూడు చమురు నౌకలు హర్మూజ్ జలసంధిని దాటి రాగలిగాయని చైనా తెలిపింది. దీనికి సహకరించిన దేశాలకు కృతజ్ఞతలు తెలిపింది. చైనా నుంచి ఇలాంటి ప్రకటన రావడం ఇదే తొలిసారి. అమెరికా ఆంక్షలున్నా చైనా మాత్రం ఇరాన్ నుంచి భారీగా చమురు దిగుమతి చేసుకుంటోంది. ఐదు అంశాలతో శాంతి మంత్రం

పశ్చిమాసియాలో ఘర్షణలకు తెరదించడానికి చైనా, పాకిస్థాన్ ఐదు అంశాల ప్రతిపాదనను తెరపైకి తెచ్చాయి. తమ దేశానికి వచ్చిన పాక్ విదేశాంగ మంత్రి మొహమ్మద్ ఇశాక్ దార్‌తో చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ సమావేశమైనప్పుడు ఇది తెరపైకి వచ్చింది. తుర్కియే, ఈజిప్టు, సౌదీ అరేబియా విదేశాంగ మంత్రులతో తాను జరిపిన చర్చల గురించి దార్ వివరించారు. తక్షణం వైరాన్ని వీడటం, సాధ్యమైనంత త్వరగా చర్చలు ప్రారంభించడం, సైనికేతర లక్ష్యాలకు రక్షణ కల్పించడం, నౌకాయాన భద్రత కల్పించడం, ఐరాస ఒప్పందాన్ని గౌరవించడం గురించి ప్రతిపాదనలో ఉంది. మానవతా సాయానికి వీలు కల్పించాలని విజ్ఞప్తి చేశాయి.

## ఎల్‌డీఎఫ్ గెలుపునకు మోదీ ప్రయత్నం



**ఎల్‌డీఎఫ్, భాజపా ఉమ్మడి శత్రువును తమ కూటమి యూడీఎఫ్ ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. కోళికోడ్ జిల్లాలోని కన్నూర్, కళ్లాచి, పెరంబ్ర, కోయిలాండిలలో మంగళవారం జరిగిన ఎన్నికల ప్రచార సభల్లో ఆయన మాట్లాడారు. ఆయన వెంట సీపీఎం మాజీ నేతలు వి. కున్హికృష్ణన్, టీకే గోవిందన్ ఉన్నారు. వారిద్దరు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు. వారికి యూడీఎఫ్ మద్దతిస్తోంది. 'ఈ ఎన్నికలు రెండు సిద్ధాంతాల మధ్య జరుగుతున్నాయి. తొలిసారిగా భాజపా, ఎల్డీఎఫ్ పొత్తు పెట్టుకోవడాన్ని చూస్తున్నాం. లెఫ్ట్ పార్టీలు మితవాదులతో పొత్తు పెట్టుకోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. వారి సిద్ధాంతాలు పూర్తిగా వైరుధ్యంతో కూడుకున్నవి. ఈ పొత్తు నచ్చకే సీనియర్ నేతలు బయటకు వచ్చి స్వతంత్రంగా పోటీ చేస్తున్నారు' అని వ్యాఖ్యానించారు. ఇతర చోట్ల మతం, దేవుడి గురించి మాట్లాడే మోదీ.. కేరళలో ఆ విషయాలను ప్రస్తావించరని విమర్శించారు. శబరిమల ఆలయంలో జరిగిన బంగారు తాపడాల స్కాం గురించి ఇప్పటివరకూ ఆయన ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు.**

# టోల్ ఇక్కడ తగ్గింది.. అక్కడ పెరిగింది

పంతంగి టోల్‌ప్లాజా వద్ద త్రీ యాక్సల్ వాహనాలకు మాత్రమే ఇరువైపులా 5 రూపాయలు తగ్గనుంది, మిగిలిన వాహనాలకు తగ్గింపు చేయలేదు. ఇక్కడ త్రీ యాక్సల్ వాహనాలకు ఒక వైపునకు రూ.290 నుంచి రూ.285కు, ఇరువైపులా రూ.435 నుంచి రూ.430 తగ్గింది. కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద కూడా కేవలం త్రీ యాక్సస్ వాహనాలకు మాత్రమే ఐదు రూపాయలు తగ్గనుంది. ఇక్కడ ఒకవైపునకు రూ.450 నుంచి రూ.445కు, రెండు వైపులా రూ.675 నుంచి రూ.670కు తగ్గుతుంది. ఏపీలోని చిల్లకల్లు వద్ద కారు, జీపు, వ్యాను, లైట్ మోటారు వాహనాలకు ఐదు రూపాయలు తగ్గించారు. ఇక్కడ వీటికి ఒకవైపునకు రూ.105 నుంచి రూ.100కు తగ్గించారు. రెండు యాక్సల్ వాహనాలకు రూ.350 నుంచి రూ.345కు, మూడు యాక్సల్ వాహనాలకు 24గంటల్లో ఇరువైపులా రూ.570 నుంచి రూ.565కు తగ్గించారు. మంచిర్యాల-చంద్రాపూర్ జాతీయ రహదారి 363పై మంచిర్యాల జిల్లా మందమర్రి, ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల సరండి టోల్ ప్లాజాల్లో గతేడాదితో పోలిస్తే కనీసం రూ.5 నుంచి నెలవారీ పాస్‌లపై గరిష్టంగా 25 చొప్పున తగ్గాయి. ఒకవైపు రాకపోకలు సాగించే మినీ వాహనాలకు ఒకవైపు జర్నీకి రూ.150 ఉండగా, 145కు తగ్గించారు. 3 జతల టైర్ల వాహనాలకు రూ.340 ఉండగా, ప్రస్తుతం రూ.335కు తగ్గింది. అలాగే నెలవారీ పాస్‌లు సైతం ఒక్కో పాస్‌కు రూ.25 నుంచి గరిష్టంగా ఏడు జతల భారీ వాహనాల వరకు రూ.160 వరకు తగ్గాయి. జనగామ -సూర్యాపేట రహదారిలో జనగామ జిల్లా దేవరుప్పుల మండలం సింగరాజుపల్లి ప్లాజా వద్ద రూ.5 నుంచి రూ.10 వరకు టోల్ చార్జీలు పెరిగాయి. కారు (నాలుగు టైర్ల వాహనాలు)కు రూ.35 నుంచి రూ.40, లైట్ కమర్షియల్ వాహనాలకు ప్రస్తుత రేటు రూ.60 ఉండగా ఇందులో ఎలాంటి మార్పు లేదు. బస్సు, ట్రక్కు వాహనాలకు ప్రస్తుతం రూ.125 ఉండగా 130కి పెరిగింది. రిటర్న్ జర్నీకి రూ.5 పెరిగింది. త్రీ యాక్సల్ కమర్షియల్ వాహనానికి ప్రస్తుతం రూ.135కి 140 పెరగగా, రిటర్న్ జర్నీకి రూ.5, ఫోర్ టూ సిక్స్ యాక్సల్స్ వాహనాలకు ప్రస్తుతం రూ.295 నుంచి 300కు పెరగగా రిటర్న్ జర్నీకి రూ.5 పెరిగింది. సెవన్ టూఓ హెచ్‌సీ వాహనాలకు ప్రస్తుతం రూ.240 ఉండగా 245కి, రిటర్న్ జర్నీకి రూ.355 నుంచి 365కి పెరిగింది. వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారిపై యాద్రాద్రి జిల్లా



బీబీనగర్ మండలంలోని గూడూరు, జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కోమల్ల టోల్ ప్లాజాల వద్ద కారు, జీపు, వ్యాన్, లైట్ మోటార్ వాహనాలకు ఒకవైపునకు రూ. 5 పెరిగింది. లైట్ కమర్షియల్ వాహనం, లైట్ గూడ్స్ వాహనం, మినీ బస్సు సింగిల్ జర్నీకి రూ. 5పెరగ్గా, రిటర్న్ జర్నీకి రూ.10 పెరిగింది. బస్సు, ట్రక్కుకు ఒకవైపునకు రూ.15 పెరిగింది. త్రీ యాక్సల్ కమర్షియల్ వాహనం ఒక వైపు రూ.10, రిటర్న్ జర్నీకి రూ.15 పెరిగింది. భారీ వాహనాలకు ఒక వైపునకు రూ.20 పెరగ్గా, రిటర్న్ జర్నీకి రూ.25 పెరిగింది.

**పెరిగిన వార్షిక ఫాస్టాగ్ పాస్‌ల రుసుము**

టోల్‌ప్లాజాల వద్ద స్వల్పంగా టోల్ రుసుమును తగ్గించినా, వార్షిక ఫాస్టాగ్ పాస్‌ల రుసుమును సైతం స్వల్పంగా పెంచారు. పెరిగిన ధరలు బుధవారం నుంచి అమలులోకి రానున్నాయి. ఇప్పటి వరకు వార్షిక ఫాస్టాగ్ పాస్‌ల రుసుము రూ.3000 ఉండగా దానిని రూ.3075కు పెంచారు. ట్రిప్పుల విషయంలో ఎలాంటి మార్పులు చేయలేదు.

# యుద్ధానికి త్వరలో తెర!

''యుద్ధాన్ని నాలుగు నుంచి ఆరు వారాలు మాత్రమే సాగించాలని ముందే నిర్ణయించుకున్నాం. హర్మూజ్ కోసం పట్టుబడితే పోరు మరిన్ని రోజులు కొనసాగేలా ఉంది. కనుక మన ప్రధాన లక్ష్యాలైన ఇరాన్ నావికా దళాన్ని, దాని క్షిపణి నిల్వలను పూర్తిగా నేలమట్టం చేసి యుద్ధానికి త్వరగా తెర దించేస్తా'' అని ట్రంప్ చెప్పుకొచ్చినట్టు పేర్కొంది. మరోవైపు సౌదీ, యూఏఈ, బహ్రెయిన్, కువైట్ వంటి గల్ఫ్ దేశాలు మాత్రం ఇరాన్ పూర్తిగా ఓడేదాకా యుద్ధాన్ని కొనసాగించాల్సిందిగా అమెరికాను కోరుతున్నట్టు అసోసియేటెడ్ ప్రెస్ పేర్కొంది!

నాటో దేశాలపై గుర్రు

ఇరాన్‌పై యుద్ధంలో తమతో కలిసి రావడం లేదంటూ నాటో భాగస్వామ్య దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గుర్రుగా ఉన్నారు. 'మీకు కావాల్సిన చమురును మీరే సమకూర్చుకోండి' అంటూ సోషల్ మీడియా పోస్టులో వాటిపై ఆక్రోశం వెళ్లగక్కారు. ''మీకోసం మీరు ఎలా పోరాడాలో నేర్చుకోండి. అమెరికా మీకిక ఏ మాత్రమూ సాయం చేయబోదు. మీరూ మాకు సాయానికి రాలేదు కదా! చమురు కావాలంటే మీకు రెండే మార్గాలున్నాయి. మా దగ్గర పుష్కలంగా ఉన్న నిల్వల నుంచి కొనుక్కోవడం. లేదంటే సాహసం చేసి హార్మూజ్ వద్ద ఇరుక్కున్న మీ చమురు నౌకలను విడిపించుకోవడం'' అంటూ బ్రిటన్, ఫ్రాన్స్ తదితర దేశాలకు సలహా ఇచ్చారు! ముఖ్యంగా అమెరికా యుద్ధ విమానాలను



తన గగనతలం గుండా వెళ్లేందుకు ఫ్రాన్స్ అనుమతించలేదంటూ మండిపడ్డారు. దీన్ని కచ్చితంగా గుర్తుంచుకుంటామని హెచ్చరించారు.

## దారుణం..
### ఆస్పత్రి ఫ్లష్‌ట్యాంక్‌లో శిశువు మృతదేహం



ఈ కబురు ,హైదరాబాద్: కూకట్‌పల్లిలో దారుణం చోటు చేసుకుంది. కూకట్‌పల్లి రాందేవ్‌రావు ఆస్పత్రిలో అమానుష ఘటన వెలుగుచూసింది. ఆస్పత్రి మహిళా వాష్‌రూమ్ ఫ్లష్ ట్యాంకులో శిశువు డెడ్ బాడీ లభించడం హృదయ విదారకంగా మారింది. ఓ మహిళ ప్రసవం అనంతరం శిశువును ఫ్లష్ ట్యాంక్‌లో పడేసింది. ఆపై అక్కడ నుంచి పరారైంది.

ప్రస్తుతం ఆ మహిళ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. అక్కడున్న సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు పోలీసులు. యావత్ సమాజాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిన ఈ ఘటనతో అంతా షాక్‌కు గురౌతున్నారు. అప్పుడే పుట్టిన పసికందను ఇలా ఫ్లష్ ట్యాంక్‌లు పడేయడం ఏంటని విస్తుపోతున్నారు.

### అంజయ్య నగర్ డివిజన్ తాగునీటి సమస్యను

## పరిష్కరించండి : ఆంజనేయులు సాగర్

**అధికారులను కలిసి సమస్య పరిష్కారం కోసం వినతి**



జలమండలి అధికారులకు ఫిర్యాదు చేస్తున్న అంజనేయులు సాగర్ తదితరులు

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :** అంజయ్య నగర్ డివిజన్ పరిధిలో నెలకొన్న మంచినీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని అంజయ్య నగర్ డివిజన్ సీనియర్ నాయకుడు ఆంజనేయులు సాగర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జలమండలి అధికారులను కలిసి విన్నవించారు. హెచ్ఎం డబ్ల్యూఎస్ డీజీఎం నరేందర్ రెడ్డి, మేనేజర్ విక్రమ్ రెడ్డిని కలిసిన ఆంజనేయులు సాగర్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు సాగర్ మాట్లాడుతూ అంజయ్య నగర్ డివిజన్ పరిధిలోని అంజయ్య నగర్ సిద్దిక్ నగర్ రాజీవ్ నగర్ తదితర ప్రాంతాల్లో సరిపడా నీటి సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ముఖ్యంగా వేసవి కాలం కారణంగా సమస్య మరింత తీవ్రమైందని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో నీటి సరఫరా పైప్ లైన్ లేకపోగా, పైప్ లైన్ ఉన్న ప్రాంతాల్లో సైతం లో ప్రెషర్ కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించి, అవసరమైతే బూస్టర్ మోటార్ ఏర్పాటు చేసి నీటి సరఫరాను సక్రమంగా నిర్వహించాలని అధికారులను కోరారు. రాజీవ్ నగర్ మంచినీటి సమస్యపై గతంలోనే అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగిందని అన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన డీజీఎం నరేందర్ రెడ్డి సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అధికారులను కలిసిన వారిలో ఆంజనేయులు సాగర్ తో పాటు రమేష్, శివ గౌడ్, పీ లక్ష్మయ్య సాగర్, యం లక్ష్మయ్య సాగర్, చంద్రమౌళి, బీమేష్ తదితరులు ఉన్నారు.

## మేడ్ ఇన్ అమరావతి
## క్వాంటం హార్డ్ వేర్ లక్ష్యం




క్యూబిట్ ఫోర్స్, క్యూబీట్స్, క్వాంటం ఏఐ గ్లోబల్, క్యూపిఐ ఏఐ, ఆటోమియోనిక్స్ , తిరుపతి ఐఐటీ ప్రొఫెసర్ సత్యనారాయణ హాజరయ్యారు. మద్రాస్ ఐఐటీ ప్రొఫెసర్ కామకోటి వర్చువల్‌గా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి క్వాంటం కంప్యూటర్ పరికరాల తయారీ కంపెనీలు, క్రయోజనిక్స్, ఫోటోనిక్స్, పవర్ ఎలక్ట్రానిక్స్ కంపెనీల ప్రతినిధులు సైతం హాజరయ్యారు. వారిని ఉద్దేశించి సీఎం ప్రసంగిస్తూ.. రెండేళ్లలో దేశీయంగా క్వాంటం కంప్యూటింగ్ పరికరాల ఉత్పత్తి దిశగా కార్యాచరణ చేపట్టాలని సూచించారు. త్వరలో సిద్ధం కానున్న ఏక్యూవీ నుంచి క్వాంటం కంప్యూటింగ్ పరికరాలు, ఇతర హార్డ్ వేర్ ఉత్పత్తి, అల్గారిథమ్స్ రూపకల్పన వంటివి చేపట్టాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. 2030 నాటికి ప్రపంచ వ్యాప్తంగా 5 గ్లోబల్ క్వాంటం హబ్స్ లో ఒకటిగా ఏపీని తీర్చిదిద్దేలా కార్యాచరణ చేపట్టాలని రౌండ్ టేబుల్ సమావేశంలో అభిప్రాయం వ్యక్తం అయ్యింది. అమరావతి క్వాంటం వ్యాలీలో దీనికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు హార్డ్ వేర్, ఎకోసిస్టం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. బయోఫౌండ్రీ సహా వివిధ స్టార్టప్ ల సహకారంతో డిజైన్లు, ఆవిష్కరణలు, పరిశోధన చేపట్టాలని సమావేశంలో చర్చించారు. మేడ్ ఇన్ అమరావతి క్వాంటం కంప్యూటర్ పరికరాల ఉత్పత్తికి విస్తృత ప్రయత్నాలు చేయాలని సూచించారు. దేశంలో తొలి క్వాంటం కంప్యూటింగ్ పాలసీ కలిగిన రాష్ట్రంగా ఏపీ ఇప్పటికే క్వాంటం టెక్నాలజీ ప్రయాణాన్ని ప్రారంభించిందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. విజయవాడలోని మేధా టవర్స్ లో ఇప్పటికే తాత్కాలికంగా క్వాంటం కంప్యూటింగ్ మిషన్ కార్యాలయం కార్యకలాపాలు ప్రారంభం అయ్యాయని వివరించారు.

ఏపీకే క్వాంటం తొలి ప్రయోజనాలు

మూడు దశాబ్దాల క్రితం ఐటీని, ఇప్పుడు క్వాంటం కంప్యూటింగ్ టెక్నాలజీని ఫస్ట్ మూవర్ అడ్వాంటేజ్ గా అందిపుచ్చుకుంటున్నామని ముఖ్యమంత్రి వివరించారు. గతంలో ఐటీలో నిపుణుల్ని తయారుచేయడానికి ఇంజనీరింగ్ కాలేజీలు, ట్రిపుల్ ఐటీలను కూడా రాష్ట్రంలో ఏర్పాటు చేసుకున్నామని... ఇప్పుడు క్వాంటం టెక్నాలజీని అందిపుచ్చుకునేలా నిపుణులకు శిక్షణ ఇస్తున్నామని వివరించారు. వైసర్, ఐబీఎం లాంటి సంస్థల సహకారంతో యువతకు క్వాంటంలో నైపుణ్యాలు పెంచుతున్నామన్నారు. అవేర్ ద్వారా రియల్ టైమ్ డేటా సేకరించటంతో పాటు రియల్ టైమ్ లో నిర్ణయాలు జరిగేలా చర్యలు చేపట్టామన్నారు. ఏఐ డాక్టర్, ఏఐ ట్యూటర్, ఏఐ అగ్రానమిస్ట్ లాంటి సేవలు పౌరులకు అందాల్సి ఉందన్నారు. ఆధునిక టెక్నాలజీలను తొలిగా అందిపుచ్చుకున్న వారికే ఎప్పుడూ ప్రయోజనాలు దక్కుతాయని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఐటీ ద్వారా హైదరాబాద్ నాలెడ్జి ఎకానమీగా మారిందని తద్వారా సేవల రంగం పెరిగి దేశానికి ప్రయోజనం కలుగుతోందన్నారు. భవిష్యత్తు అంతా ఇక క్వాంటం కంప్యూటింగ్‌దేనని జాతీయ క్వాంటం మిషన్ లక్ష్యానికి అనుగుణంగా ఏక్యూవీని ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ సహకారంతో దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటర్ ఏపీలో ఏర్పాటు అవుతోందని సీఎం వివరించారు.

రాజధాని అమరావతిలో క్వాంటం వ్యాలీలో నిర్మిస్తున్న 8 టవర్లలో క్వాంటం కంప్యూటింగ్ సెంటర్‌తో పాటు ఆవిష్కరణలు, పరిశోధనలతో పాటు స్టార్టప్‌లకు కూడా అవకాశం కల్పిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. క్వాంటం హార్డ్ వేర్ దిగుమతి కాకుండా ఇక్కడే తయారు చేసుకోవాలన్న లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలియచేశారు. క్వాంటం పరికరాలు, టెక్నాలజీ, క్రయోజనిక్స్, అల్గారిథమ్స్ ఇలా మనమే తయారు చేసుకునేలా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. క్వాంటం కంప్యూటింగ్ వ్యాలీతో అమరావతి ఇక భవిష్యత్ నగరంగా అత్యుత్తమ లివబుల్ సిటీగా మారుతుందన్నారు. దీనికి అవసరమైన టెక్నాలజీని, భాగస్వామ్యాన్ని అందించాలని జాతీయ క్వాంటం మిషన్‌ను ముఖ్యమంత్రి కోరారు.

ఏప్రిల్ 14న అందుబాటులోకి తొలి ఓపెన్ క్వాంటం కంప్యూటర్

దేశంలోనే తొలి ఓపెన్ క్వాంటం కంప్యూటర్ అమరావతిలో ఏప్రిల్ 14 తేదీ నుంచి అందరికీ అందుబాటులోకి తీసుకురానున్నట్టు క్యూబిట్ ఫోర్స్ సంస్థ డైరెక్టర్ వెంకట్ సుబ్రమణ్యన్, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ సతీష్ కుమార్ ముఖ్యమంత్రికి వివరించారు. విద్యార్థులు, పరిశోధకులకు ఈ క్వాంటం కంప్యూటర్ టెస్టింగ్ కోసం సిద్ధంగా ఉంటుందని తెలిపారు. క్వాంటం ఎకోసిస్టమ్ కు అనువుగా టెస్ట్ బెడ్స్, సర్టిఫికేషన్ లాంటివి ఉండాలని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సీడాక్ ఈడీ సుదర్శన్ వివరించారు. క్వాంటం సిమ్యులేటర్స్ తో పాటు బయోసెన్సార్స్, మినరల్ సెన్సార్స్, లేజర్ అప్లికేషన్స్ అమరావతి క్వాంటం వ్యాలీలో అందించేందుకు సిద్ధమని వివిధ క్వాంటం కంప్యూటింగ్ సంస్థలు ముఖ్యమంత్రికి తెలియచేశాయి. జాతీయ క్వాంటం మిషన్ లక్ష్యాలను అందిపుచ్చుకోవటంలో ఏపీ అగ్రస్థానంలో ఉందని ఎన్ క్యూఎం మిషన్ డైరెక్టర్ జేబీవీ రెడ్డి ముఖ్యమంత్రికి తెలిపారు. మొత్తంగా 30కి పైగా క్వాంటం కంప్యూటింగ్ పరికరాల తయారీ కంపెనీలు ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరయ్యాయి. 15 కంపెనీలతో ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అవగాహనా ఒప్పందాలను కుదుర్చుకుంది. విజయవాడలోని మేధా టవర్స్ లో 7 సంస్థలు ఇప్పటికే తమ కార్యకలాపాలను ప్రారంభించాయి.

## ఉన్నపళంగా ఉరిమిన వాన



ఈ కబురు, హైదరాబాద్, నిజామాబాద్ జగిత్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షాలు అన్నదాతలకు తీరని నష్టాన్ని కల్గించాయి. ముఖ్యంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గాలివాన బీభత్సం సృష్టించింది. జగిత్యాల జిల్లావ్యాప్తంగా పంటలకు అధిక నష్టం జరిగింది. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లోనూ పంటలు దెబ్బతిన్నాయి. సోమవారం నుంచి మంగళవారం ఉదయం వరకు అత్యధికంగా కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలో 5.6 సెం.మీ. వర్షం కురిసింది. ఇదే జిల్లా వాంకిడిలో 4.5, సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో 3.7, జనగామ జిల్లా దేవరుప్పలలో 3.5, మంచిర్యాల జిల్లా తాండూరులో 2.6, జగిత్యాల జిల్లా భీర్పూర్ మండలంలో 2.5 సెం.మీ. కురిసింది. ములుగు, రంగారెడ్డి, నిర్మల్, నిజామాబాద్, మంచిర్యాల జిల్లాల్లోనూ 1.6 సెం.మీ నుంచి 2.4 సెం.మీ మధ్య నమోదైంది. పగటిపూట పలు జిల్లాల్లో వడగళ్లు పడ్డాయి. జగిత్యాల జిల్లాలో 9 వేల ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు గాలివానల కారణంగా కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లోనూ పంటలు దెబ్బతిన్నాయి. జగిత్యాల జిల్లాలో మొత్తం 20 మండలాల్లోని 126 గ్రామాల్లో 5,986 మంది రైతులకు చెందిన 9,393 ఎకరాల్లో వివిధ రకాల పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. అత్యధికంగా 6,162 ఎకరాల్లో మామిడి కాయలు నేలరాలాయి. 1,521 ఎకరాల్లో మొక్కజొన్న పైరు నేలవాలింది. 1,128 ఎకరాల్లో వరి పైర్లు పడిపోగా కోతదశలో ఉన్న పంటలో గింజలు రాలిపోయాయి. 582 ఎకరాల్లో నువ్వు పంటకూ నష్టం జరిగింది. పలు చోట్ల కూరగాయలు, జొన్న, సజ్జ తదితర పంటలు దెబ్బతిన్నాయి. ఆయా పంటలను జిల్లా వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు మంగళవారం పరిశీలించారు. ఉడికించి కల్లాల్లో ఆరబెట్టిన పసుపు కొమ్ములు, మక్కలు, జొన్నలు, కందులు తదితర ఉత్పత్తులు సైతం తడిసి ముద్దయ్యాయి. నిజామాబాద్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు అమ్మకానికి తీసుకొచ్చిన పసుపు కుప్పలు వర్షపు నీటిలో తడిశాయి. రాత్రివేళ ఉన్నట్టుండి వాన రావడంతో కొమ్ములను సంచుల్లో నింపలేకపోయినట్లు రైతులు వాపోయారు.


**13 జిల్లాల్లో దడ పుట్టించిన ఎండలు**

మంగళవారం రాష్ట్రంలోని 13 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా అధికంగా నమోదయ్యాయి. ఏడు జిల్లాల్లో 41 డిగ్రీలు దాటింది. నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్‌లో 41.7, నిర్మల్ జిల్లా సారంగాపూర్‌లో 41.5, జగిత్యాల జిల్లా మల్లాపూర్‌లో 41.4, ఆదిలాబాద్ జిల్లా బేలలో 41.2, కామారెడ్డి జిల్లా జుక్కల్‌లో 41.1, నల్గొండ జిల్లా గట్టుప్పల్‌లో 41.1 డిగ్రీలుగా నమోదైంది. కుమురంభీం ఆసిఫాబాద్, జోగులాంబ గద్వాల, మంచిర్యాల, నారాయణపేట, నాగర్‌కర్నూల్, మెదక్, వనపర్తిలలో 40 డిగ్రీలపైన నమోదయ్యాయి.

**నేడు, రేపు, ఎల్లుండి వడగళ్ల వానలు**

రాష్ట్రంలో బుధ, గురు, శుక్రవారాల్లో పలు జిల్లాల్లో వడగళ్ల వానలు పడే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. 40 కి.మీ. నుంచి 50 కి.మీ. వేగంతో కూడిన ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో వర్షాలు కురుస్తాయంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నట్లు పేర్కొంది.

## గూర్ఖాలాండ్ నినాదం కనుమరుగు?



**ఈ-కబురు,**

పశ్చిమ బెంగాల్‌లోని దార్జీలింగ్ కొండలు ఒకప్పుడు గూర్ఖాలాండ్ ప్రత్యేక రాష్ట్ర డిమాండుతో మారుమోగేవి. ఏ ఎన్నికలొచ్చినా అదే ప్రధానాంశంగా సాగేవి. ఇప్పుడా ప్రాంతంలో ఆ డిమాండు పెద్దగా వినిపించడం లేదు. గూర్ఖాలాండ్ నినాదాలు మసకబారాయి. సరికొత్త శకంలోకి ఈ ప్రాంతం ప్రవేశిస్తోంది. దశాబ్దాల తర్వాత తొలిసారిగా ఈ ప్రాంతంలో గూర్ఖాలాండ్‌పై కాకుండా ఇతర అంశాలపై ఎన్నికలు జరగబోతున్నాయి.

దశాబ్దాల డిమాండు..

దశాబ్దాలపాటు ఉత్తర బెంగాల్‌లోని దార్జీలింగ్, కాలింపాంగ్, కుర్సియాంగ్ జిల్లాల్లో ప్రత్యేక గూర్ఖాలాండ్ డిమాండు ఒక భావోద్వేగంగా ఉండేది. ఎన్నికల అంశమూ అదే. ప్రస్తుతం దాని ప్రభావం కొంత ఉన్నా మిగిలిన అంశాలూ ప్రధానంగానే మారాయి. ఇప్పుడు మా రోడ్లను ఎవరు మరమ్మతు చేస్తారు.. పర్యాటకానికి ఎవరు పునర్వైభవం తెస్తారు.. తాగునీటికి ఎవరు హామీ ఇస్తారు.. పాఠశాలలు, ఆసుపత్రులను ఎవరు అభివృద్ధి చేస్తారు.. టీ తోటల్లో వేతనాలను పెంచేందుకు ఎవరు సహకరిస్తారు.. సంక్షేమ పథకాలను ఎవరు అమలు చేస్తారు.. అనే అంశాలూ ప్రభావం చూపుతున్నాయి. దీంతో గతంలో ఎన్నడూ లేనంత సంక్లిష్ట రాజకీయ పరిస్థితి నెలకొంది.

రెండు కూటముల మధ్య..

ప్రస్తుత ఎన్నికలు.. అధికార తృణమూల్ కాంగ్రెస్ భారతీయ గూర్ఖా ప్రజాతాంత్రిక్ మోర్చా (బీజీపీఎం) కూటమికి, భాజపా నేతృత్వంలోని ఎన్డీయేకు మధ్య జరుగుతున్నాయి. అనిత్ థాపా నేతృత్వంలోని బీజీపీఎం.. అంతం లేకుండా సాగించిన పోరాటాన్ని పక్కనబెట్టి అభివృద్ధి రాజకీయాలను చేస్తోంది. అయితే ఈ ప్రాంతానికి శాశ్వత పరిష్కారం పేరుతో భావోద్వేగ రాజకీయాలను అనుసరిస్తోంది. గూర్ఖాల గుర్తింపునకు రోడ్లు, సంక్షేమం, పర్యాటక ప్రాజెక్టులు ప్రత్యామ్నాయం కావని వాదిస్తోంది.

--1980ల నుంచీ..

1980లలో గూర్ఖా నేషనల్ లిబరేషన్ ఫ్రంట్ (జీఎన్ఎల్ఎఫ్) ఆధ్వర్యంలో హింసాత్మక ఆందోళనలు జరిగాయి. ఆ తర్వాత బిమల్ గురుంగ్ నేతృత్వంలో ఏర్పాటైన గూర్ఖా జన్‌ముక్తి మోర్చా (జీజేఎం) నుంచీ సుదీర్ఘకాలం పాటు ఉద్యమాలు జరిగాయి. అయినా రాష్ట్ర హోదా దక్కలేదు. 2009లో ఈ ప్రాంతంలోకి ప్రవేశించిన భాజపా.. ఆ తరువాతి కాలంలో జీజేఎం, జీఎన్ఎల్ఎఫ్‌తో కలిసి దార్జీలింగ్ లోక్‌సభ సీటును గెలుచుకోగలిగింది. ఎన్నికల్లో విజయం కోసం ప్రతిసారీ రాజకీయ పరిష్కార హామీని ఇస్తున్న భాజపా.. ఆ తర్వాత దానిని పట్టించుకోవడం లేదు.

భారీగా ఓట్ల కోత

ఈసారి ఎన్నికల్లో సర్ ద్వారా ఓట్ల తొలగింపు మరో ప్రధానాంశంగా ఉంది. ఒక్క దార్జీలింగ్ జిల్లాలోనే 1.22 లక్షల ఓట్లను ఈసీ తొలగించింది. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో గత ఎన్నికల్లో భాజపాకు వచ్చిన మెజారిటీల కంటే అధికంగా తొలగించారు. ఈ తొలగింపు గూర్ఖాలాండ్ ప్రాంతంలో ఎన్నికల లెక్కలను పూర్తిగా మార్చేసింది.

**2017లో కుప్పకూలిన ఆర్థిక వ్యవస్థ**

2017లో జరిగిన 100 రోజుల ఆందోళన కారణంగా ఈ ప్రాంత ఆర్థిక వ్యవస్థ దారుణంగా దెబ్బతింది. పర్యాటక వ్యాపారం కుప్పకూలింది. పాఠశాలలు మూతపడ్డాయి. టీ తోటలు సంక్షోభంలో చిక్కుకున్నాయి. ఆ తర్వాత గూర్ఖాలాండ్ ఉద్యమం కనుమరుగు కావడమే కాదు.. ముక్కలైంది. బిమల్ గురుంగ్ ప్రాభవం కోల్పోయారు. జీఎన్ఎల్ఎఫ్ ప్రతిష్ఠ మసకబారింది. ఈ సమయంలో వచ్చిన అనిత్ థాపా బీజీపీఎం.. బలం పుంజుకుంది. అధికార తృణమూల్‌తో కలిసి అభివృద్ధికి అడుగులేసింది. అభివృద్ధితోపాటు గౌరవం పేరుతో ప్రజల్లో ప్రాబల్యం పెంచుకుంది. ఈ పార్టీతో వ్యూహాత్మకంగా పొత్తు పెట్టుకున్న తృణమూల్ పాగా వేసేందుకు ప్రయత్నించి విజయం సాధించింది. దీంతోపాటు మమత బెంగాలీ నినాదం కలిసివచ్చింది. మరోవైపు గూర్ఖాలాండ్ సెంటిమెంటును తృణమూల్ తక్కువగా అంచనా వేస్తోందని భాజపా భావిస్తోంది. అందుకే ఆ అంశాన్ని వాడుకుంటోంది.బిమల్ గురుంగ్ నేతృత్వంలోని జీజేఎం.. దార్జీలింగ్ జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో భాజపాకు మద్దతిస్తోంది. ఆ పార్టీయే శాశ్వత పరిష్కారం చూపగలదని చెబుతోంది. గతంలో గూర్ఖాలాండ్ ఉద్యమంలో పాల్గొన్న నేతలతోపాటు స్థానికంగా బలమున్న వారికి భాజపా టికెట్లు ఇచ్చింది. బీజీపీఎంలా కాకుండా గూర్ఖాలాండ్ డిమాండుకే ఐజీజేఎఫ్ కట్టుబడి ఉంది.

## అర్ధశతాబ్దం తర్వాత జాబిలి దిశగా..



కేప్ కనావరల్ (ఫ్లోరిడా): అంతరిక్ష యాత్రలకు జాబిలిని మజిలీగా మార్చుకునే లక్ష్యంతో నాసా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆర్టీమిస్-2 ప్రయోగం నేడు ఫ్లోరిడాలోని కేప్ కనావరల్‌లోని 'కెన్నడీ అంతరిక్ష కేంద్రం'వేదికగా జరగనుంది. అమెరికా కాలమానం ప్రకారం బుధవారం సాయంత్రం 6.24 గంటలకు(భారతకాలమానం ప్రకారం బుధవారం అర్ధరాత్రి దాటాక 3.54 గంటలకు) నలుగురు వ్యోమగాములతో 32 అంతస్తుల ఎత్తయిన 'స్పేస్ లాంచ్ సిస్టమ్ రాకెట్'నింగిలోకి దూసుకుపోనుంది. దీనికి సంబంధించిన కౌంట్‌డౌన్ సోమవారమే ప్రారంభించారు. దాదాపు 53 ఏళ్ల తర్వాత చందమామ సంబంధ ప్రాజెక్ట్‌కు నాసా శ్రీకారంచుట్టి శరవేగంగా ఆచరణలో పెట్టింది. అంతా సవ్యంగా సాగితే అమెరికా, కెనడా వ్యోమగాములు రెయిడ్ వైస్‌మ్యాన్(కమాండర్), విక్టర్ గ్లోవర్(పైలట్), క్రిస్టినా కూచ్(మహిళా మిషన్ స్పెషలిస్ట్), జెరిమీ హాన్సెన్‌లు చందమామ సమీప కక్ష్యలోకి వెళ్లి వస్తారు. నింగిలోకి దూసుకెళ్లాక తొలిరోజు వీళ్లు భూకక్ష్యలో తిరిగి తర్వాత చంద్రుని దిశగా ప్రయాణం మొదలెడతారు. ఈ మొత్తం యాత్ర 8 అంకె ఆకృతిలో సాగనుంది. మొత్తం 10 రోజుల యాత్ర తర్వాత వీళ్లు ప్రయాణించే క్యాప్సూల్ పసిఫిక్ మహాసముద్రజలాల్లో పడిపోనుంది. ఈ ప్రయోగంలో చందమామపై వ్యోమగాముల ల్యాండింగ్ ఉండబోదు.

కేవలం చందమామను వ్యోమగాములు దాదాపు 7,600 కిలోమీటర్ల ఎత్తు నుంచి పరిశీలించి తిరిగొస్తారు. ఆర్టీమిస్2 ప్రయోగంలో వ్యోమగాములు తమ రక్షణ కోసం ఓరియాన్ సంస్థ తయారుచేసిన 'ఇంటిగ్రిటీ'క్యాప్సూల్‌లో పయనించనున్నారు. ఇది వ్యోమగాములు తిరుగుప్రయాణంలో గంటకు 40,000 కిలోమీటర్ల వేగంతో భూవాతావరణంలోకి వచ్చినా వాళ్లకు ఎలాంటి హాని కల్గకుండా రక్షణనిస్తుంది. వాస్తవానికి ఆర్టీమిస్-2 ప్రయోగం ఫిబ్రవరిలోనే జరగాల్సి ఉంది. కానీ రాకెట్ నుంచి హైడ్రోజన్ ఇంధనం లీకేజీ కారణంగా ప్రయోగం వాయిదాపడింది. తర్వాత సమస్యను పరిష్కరించినా హీలియం పీడనవ్యవస్థ విఫలమవడంతో ప్రయోగం మళ్లీ వాయిదాపడింది. ఎట్టకేలకు బుధవారం ప్రయోగంచేపట్టేందుకు రంగంసిద్ధమైంది.



## వార్ ఎఫెక్ట్: మదుపర్ల సంపద ₹51 లక్షల కోట్లు హుష్‌కాకి!

దిల్లీ: పశ్చిమాసియా యుద్ధం దలాల్‌స్ట్రీట్‌నూ వణికిస్తోంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దాడులు ప్రారంభమై నెల రోజులు పూర్తి కావస్తోంది. ఈ నెల రోజుల్లో స్టాక్ మార్కెట్‌లో మదుపర్ల సంపద దాదాపు రూ.51 లక్షల కోట్లు ఆవిరైంది. యుద్ధం ప్రారంభమైన నాటి నుంచి బీఎస్‌ఈ బెంచ్ మార్క్ ఇండెక్స్ సెన్సెక్స్ ఏకంగా 11 శాతం పతనమైంది. యుద్ధం కారణంగా క్రూడాయిల్ ధరలు పెరగడం, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు, దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి పెద్ద ఎత్తున విదేశీ మదుపర్లు తమ సంపదను తరలించడమూ మన మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపింది.

ఫిబ్రవరి 27న ఇరాన్‌పై దాడి జరిగింది. అప్పటి నుంచి సెన్సెక్స్ 9339.64 పాయింట్లు అంటే దాదాపు 11.48 శాతం మేర పతనమైంది. బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.51,09,498.82 కోట్లు క్షీణించి రూ.4,12,41,172.45 (రూ.412 లక్షల కోట్లు)కు చేరింది. మార్కెట్ ఈ స్థాయి పతనానికి బాహ్య కారకాలే కారణమని ఎన్‌రిచ్ మనీ సీఈఓ పొన్‌ముది పేర్కొన్నారు. క్రూడాయిల్ ధరలు భారీగా పెరిగిపోవడం, భౌగోళిక ఉద్రిక్తతలు, ఎఫ్ఐఐల విక్రయాలు స్టాక్ మార్కెట్‌లో భయాందోళన వాతావరణాన్ని నెలకొల్పాయని అభిప్రాయపడ్డారు. విదేశీ మదుపర్లు ఒక్క మార్చిలోనే సుమారు రూ.1 లక్ష కోట్ల మేర ఈక్విటీ షేర్లను విక్రయించారు. సెన్సెక్స్ ఆల్‌టైమ్ గరిష్ఠాల (86,159.02) నుంచి ఇప్పటి వరకు దాదాపు 16 శాతం క్షీణించి 14,211.47 పాయింట్లు పతనమైంది.

## అనుమతులకు ముందే..
### చైనా యూజర్లకు యాపిల్ ఏఐ ఫీచర్..!



ప్రముఖ టెక్ సంస్థ యాపిల్ కొత్తగా అభివృద్ధి చేసిన ఓ ఏఐ ఫీచర్ ఇటీవల చైనా యూజర్లకు కొంతసేపు అందుబాటులోకి వచ్చింది. అయితే, రెగ్యులేటరీ అనుమతులకు ముందే అక్కడి వినియోగదారుల ఫోన్లలో ఈ ఫీచర్ ప్రత్యక్షమవడం చర్చకు దారితీసింది. పొరబాటును గ్రహించిన యాపిల్ (Apple).. తక్షణమే దాన్ని తొలగించినట్లు సమాచారం. ఈమేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. చైనా (China)లోని యూజర్లకు యాపిల్ ఇంటెలిజెన్స్ ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు అలీబాబా కంపెనీతో కలిసి అమెరికా టెక్ సంస్థ కొంతకాలంగా పనిచేస్తోంది. అయితే, విదేశీ ఏఐ సాంకేతికతపై ఉన్న ఆంక్షల కారణంగా చైనా సైబర్‌స్పేస్ అడ్మినిస్ట్రేషన్ నుంచి ఈ ఫీచర్‌కు రెగ్యులేటరీ అనుమతులు లభించడంలో సమస్యలు ఎదురవుతున్నాయి. మరోవైపు హువావే, షావోమీ వంటి కంపెనీలు ఇప్పటికే చైనాలో తమ కస్టమర్లకు ఏఐ ఫీచర్లను అందుబాటులోకి తేవడం యాపిల్‌కు మరింత ఇబ్బందులు తెచ్చిపెట్టింది. ఈ క్రమంలోనే ఇటీవల కొంతమంది చైనీస్ యూజర్ల ఐఫోన్లలో యాపిల్ ఇంటెలిజెన్స్ ఫీచర్ ప్రత్యక్షమవడం చర్చనీయాంశమైంది. తమ సెట్టింగ్స్ యాప్‌లో ఈ ఫీచర్ యాక్టివ్‌లో ఉన్నట్లు యూజర్లు గుర్తించి సోషల్‌మీడియాలో పోస్టులు చేశారు. దీంతో ఇది కాస్తా వైరల్‌గా మారింది. దీంతో వెంటనే అప్రమత్తమైన యాపిల్.. ఈ ఫీచర్‌ను ఆఫ్‌లైన్‌కు తెచ్చినట్లు సదరు కథనాలు వెల్లడించాయి. కాగా.. ఈ ఇంటెలిజెన్స్ ఫీచర్ భారత్‌లో గతేడాది నుంచి అందుబాటులోకి వచ్చింది. మరోవైపు, యాపిల్ కొత్తగా అప్‌గ్రేడ్ చేస్తోన్న ఏఐఆధారిత సిరి ఫీచర్ కోసం యూజర్లు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం కోడ్ నేమ్ 'కాంపో' పేరుతో టెస్టింగ్ దశలో ఉంది. ఈ ఫీచర్‌ను జూన్‌లో విడుదల చేసే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

## ఇండిగో కొత్త సీఈవోగా విలియం వాల్ష్



ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగో సీఈవోగా (IndiGo CEO) బ్రిటీష్ ఎయిర్‌వేస్ మాజీ చీఫ్ విలియం వాల్ష్ నియమితులయ్యారు. పీటర్ ఎల్బర్స్ రాజీనామాతో ఏర్పడిన ఖాళీని వాల్ష్‌తో ఇండిగో భర్తీ చేసింది. ప్రస్తుతం ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియషన్ (IATA) డైరెక్టర్ జనరల్‌గా వాల్ష్ వ్యవహరిస్తున్నారు. ఐఏటీఏలో ఆయన పదవీ కాలం జులై 31న ముగియనుంది. ఆగస్టు 3 తర్వాత పదవీ బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది.

గతేడాది డిసెంబర్‌లో భారీ స్థాయిలో ఇండిగో విమానాలు రద్దైన సంగతి తెలిసిందే. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ క్రమంలోనే పీటర్ ఎల్బర్స్ తన పదవీ కాలం ముగియడానికి 18 నెలల ముందే అకస్మాత్తుగా రాజీనామా చేశారు. దీంతో కొత్త సీఈవో నియామకం చోటుచేసుకుంది. ఇండిగో వంటి బలమైన పునాదులు కలిగిన సంస్థకు నాయకత్వం వహించడం సంతోషంగా ఉందని విలియం వాల్ష్ పేర్కొన్నారు. విమానయాన రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సంస్థను ముందుకు తీసుకెళ్తానని తెలిపారు.

### ఐటీఆర్ ఫారాలు నోటిఫై చేసిన కేంద్రం..
# ఏ ఫారం ఎవరికోసం?




దిల్లీ: పన్ను చెల్లింపుదారులకు అలర్ట్! 202627 మదింపు సంవత్సరానికి గానూ ఆదాయపు పన్ను రిటర్నులు (Income tax Returns) దాఖలు చేసేందుకు సంబంధించిన ఫారాలను ఆదాయపు పన్ను విభాగం నోటిఫై చేసింది. చిన్న, మధ్యతరహా పన్ను చెల్లింపుదారులకు ఉద్దేశించిన ఐటీఆర్ 1, 4ను మార్చి 30న నోటిఫై చేయగా.. ఐటీఆర్ 2, 3, 5, 6, 7తో పాటు అప్‌డేట్ చేసిన రిటర్నులు దాఖలు చేసేందుకు ఉద్దేశించిన ఐటీఆర్‌యూను మంగళవారం నోటిఫై చేసింది. అంటే వ్యక్తులు, వ్యాపారులు, సంస్థలు 2025 26 ఆర్థిక సంవత్సరంలో ఆర్జించిన ఆదాయానికి గానూ రిటర్నులు దాఖలు చేసుకోవచ్చన్నమాట. ఆడిట్ అవసరం లేని వ్యక్తులు జులై 31లోగా ఐటీఆర్ ఫైల్ చేయాల్సి ఉంటుంది.

ఏ ఫారాలు ఎవరి కోసం?

ITR ఫారం 1 (సహజ్), ఐటీఆర్ ఫారం 4 (సుగమ్) అనేవి చిన్న, మధ్య తరహా పన్ను చెల్లింపుదారులకు ఉద్దేశించినవి.ఐటీఆర్ 1: వార్షిక ఆదాయం రూ.50 లక్షల వరకు ఉండేవారు ఐటీఆర్ 1 దాఖలు చేయాలి. జీతం, ఒక ఇంటి నుంచి వచ్చే ఆదాయం, ఇతర రూపాల్లో (వడ్డీ) ఆదాయం, ఏడాదికి రూ.5,000 వరకు వ్యవసాయ ఆదాయం ఉండే వ్యక్తులు సహజ్‌ను ఎంపిక చేసుకోవచ్చు.ఐటీఆర్ 4: మొత్తం వార్షిక ఆదాయం రూ.50 లక్షల వరకు ఉండి, వ్యాపారం, వృత్తి ద్వారా ఆదాయం పొందే వ్యక్తులు, హిందూ అవిభాజ్య కుటుంబాలు (HUF), సంస్థలు (ఎల్ఎల్‌పీ మినహా) సుగమ్ ఫారాన్ని ఎంచుకోవచ్చు

ఐటీఆర్ 2: మూలధన లాభాలున్న వ్యక్తులు, హిందూ అవిభాజ్య కుటుంబాలు ITR2ను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. వ్యాపారం, వృత్తి ద్వారా ఆదాయం ఆర్జించిన వారికి ఇది వర్తించదు.

ఐటీఆర్ 3: వృత్తి, వ్యాపారం ద్వారా ఆదాయం ఆర్జించే వ్యక్తులు, హెచ్‌యూఎఫ్‌ల కోసం ఈ ఐటీఆర్ ఫారం తీసుకొచ్చారు.

ఐటీఆర్ 5: సంస్థలు, ఎల్ఎల్‌పీలు, సహకార సంఘాలు ఐటీఆర్ 5ను దాఖలు చేయాలి.

ఐటీఆర్ 6: కంపెనీల చట్టం కింద నమోదు చేసుకున్న కంపెనీలు దీన్ని ఎంపిక చేసుకోవాలి.

ఐటీఆర్ 7: ట్రస్టులు, స్వచ్ఛంద సంస్థలు ఈ ఫారాన్ని ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది.

### బంగారం ధరలు..
# ఊహకందని మార్పులు!

**ఇటీవల కాలంలో బంగారం ధరలు గంటల వ్యవధిలోనే ఊహకందని విధంగా మారిపోతున్నాయి. ఉదయం ఒక రేటు ఉంటే.. సాయంత్రానికి మరో రేటు ఉంది. ఈ రోజు కూడా ఇదే బాటలు గోల్డ్ రేటు అడుగులు వేసింది. ఈ కథనంలో దేశంలోని ప్రధాన నగరాల్లో పసిడి ధరలు ఎలా ఉన్నాయో వివరంగా తెలుసుకుందాం.**




హైదరాబాద్, విజయవాడ నగరాల్లో 136850 రూపాయల వద్ద ఉన్న 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర, సాయంత్రానికి 137050 రూపాయల వద్దకు చేరింది. అంటే ఉదయం నుంచి సాయంత్రానికి ధర రూ.200 పెరిగింది. 24 క్యారెట్ల ధర రూ. 149290 నుంచి 149510 రూపాయల వద్దకు చేరింది. ఇదే ధరలు బెంగళూరు, ముంబై నగరాల్లో కూడా కొనసాగుతాయి.ఢిల్లీలో కూడా ధరలు పెరిగాయి. 24 క్యారెట్ల ధర 10 గ్రాముల బంగారం ధర 149660 రూపాయల వద్దకు చేరగా.. 22 క్యారెట్ల తులం గోల్డ్ రేటు 137200 రూపాయాల వద్దకు చేరింది. ఈ రేట్లు ఉదయానికి, సాయంత్రానికి చాలా తేడా ఉన్నట్లు స్పష్టంగా అర్థమవుతోంది.అయితే.. చెన్నై నగరంలో మాత్రం బంగారం ధరల్లో ఎలాంటి మార్పు లేదు. కాబట్టి 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రేటు 136700 రూపాయల వద్ద, 24 క్యారెట్ల తులం పసిడి ధర 149130 రూపాయల వద్ద ఉంది.

**వెండి ధరలు**

**కేజీ వెండి ధర రూ.250000 వద్ద ఉంది. ఈ రోజు (మంగళవారం) కేజీ సిల్వర్ రేటు రూ.5000 తగ్గడంతో రూ.2.5 లక్షల వద్ద నిలిచింది. అయితే ఢిల్లీలో వెండి రేటు రూ.5000 పెరిగింది. దీంతో అక్కడ కేజీ సిల్వర్ ధర రూ.2.5 లక్షల వద్ద ఉంది.**

## దేశంలో సగటు డేటా వినియోగం నెలకు 31GB: నోకియా

దేశంలో మొబైల్ డేటా వినియోగం వేగంగా పెరుగుతోంది. 2025లో నెలవారీ సగటు వినియోగం 31జీబీగా ఉందని ప్రముఖ టెలికాం గేర్ తయారీ సంస్థ నోకియా వెల్లడించింది. 2024లో మొబైల్ డేటా వినియోగం 27.5 జీబీ అని పేర్కొంది. ఈ మేరకు వార్షిక మొబైల్ బ్రాడ్‌బ్యాండ్ ఇండెక్స్ 13వ ఎడిషన్‌ను విడుదల చేసింది. 2025లో నెలకు 12.9 ఎక్సాబైట్స్ (EB) (100కోట్ల జీబీ 1 ఎక్సాబైట్‌తో సమానం) డేటాను వినియోగించినట్లు నోకియా వెల్లడించింది.దేశంలో మొత్తం మొబైల్ బ్రాండ్ ట్రాఫిక్‌లో 5జీ వాటా 47 శాతంగా ఉందని నోకియా తెలిపింది. గడిచిన ఐదేళ్లలో మొబైల్ డేటా వినియోగంలో 18 శాతం వార్షిక వృద్ధి నమోదవుతోందని పేర్కొంది. ఏఐ అప్లికేషన్ల వినియోగం, 4K వీడియో స్ట్రీమింగ్, క్లౌడ్ గేమింగ్ కారణంగా డేటా వినియోగం పెరుగుతోందని నోకియా తన నివేదికలో పేర్కొంది. 2025లో మొత్తం డేటా వినియోగం నెలకు 27 ఎక్సాబైట్లు దాటిందని తెలిపింది.ప్రపంచంలో రెండో అతిపెద్ద 5జీ సబ్‌స్క్రైబర్ బేస్ కలిగిన దేశంగా భారత్ అవతరించిందని నోకియా వెల్లడించింది. 5జీ డేటా వినియోగంలోనూ, 5జీ ఫిక్స్‌డ్ వైర్‌లెస్ యాక్సెస్ విషయంలోనూ ప్రపంచవ్యాప్తంగా భారత్ రెండో స్థానంలో ఉందని తెలిపింది.దేశీయ టెలికాం కంపెనీలకు అత్యాధునిక మౌలిక సదుపాయాలను అందించేందుకు నోకియా కట్టుబడి ఉందని కంపెనీ భారత మేనేజర్ విభా మెహ్రా తెలిపారు. 2031 నాటికి దేశంలో 5జీ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 100 కోట్ల మైలురాయి దాటుతుందని నోకియా అంచనా వేసింది.

## 3 వేరియంట్లలో టీవీఎస్ కొత్త అపాచీ RTR 160 4V.. ధర ఎంతంటే?

ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ టీవీఎస్ మోటార్ కంపెనీ 2026 అపాచీ ఆర్‌టీఆర్ 160 4Vని దేశీయ మార్కెట్‌లోకి విడుదల చేసింది. టాప్ వేరియంట్లలో ఉండే ఫీచర్లను స్టాండరడ్‌గా తీసుకొచ్చారు. కొత్త అపాచీ ప్రారంభ ధరను రూ.1.25 లక్షలుగా (ఎక్స్‌షోరూమ్) కంపెనీ నిర్ణయించింది. గరిష్ఠంగా రూ.1.37 లక్షల వరకు ఉంటుంది. కొత్త అపాచీలో ఎల్ఈడీ డీఆర్ఎల్‌స్‌తో కూడిన క్లాస్‌డి ప్రాజెక్టర్ హెడ్‌ల్యాంప్ ఉంది. అసిస్ట్ అండ్ స్లిప్పర్ క్లచ్ స్టాండరడ్‌గా అన్ని వేరియంట్లలోనూ అందిస్తున్నారు. కొత్త అపాచీ మొత్తం మూడు వేరియంట్లలో లభ్యమవుతుంది. ఎంట్రీ లెవల్ మోడల్ సింగిల్ ఛానెల్ ఏబీఎస్, టెలిస్కోపిక్ ఫోర్క్స్, డిజిటల్ ఎల్ఈడీ క్లస్టర్‌తో వస్తోంది. మ్యాటీ బ్లాక్, రేసింగ్ రెడ్ రంగుల్లో లభ్యమవుతుంది. మిడ్ లెవల్ వేరియంట్ డ్యూయల్ ఛానెల్ ఏబీఎస్, అప్‌సైడ్ డౌన్ ఫోర్క్‌తో వస్తోంది. దీనిధర రూ.1.31 లక్షలుగా నిర్ణయించారు. మ్యాటీ బ్లాక్, గ్రానైట్ గ్రే, పెరల్ వైట్ రంగుల్లో లభిస్తుంది. టాప్ ఎండ్ మోడల్ టీఎఫ్‌టీ వేరియంట్ 5 అంగుళాల టీఎఫ్‌టీ స్క్రీన్, ట్రాక్షన్ కంట్రోల్ ఫీచర్‌తో వస్తోంది. ఇది మ్యాటీ బ్లాక్, రేసింగ్ రెడ్, మెరైన్ బ్లూ రంగుల్లో లభిస్తుంది.ఇక ఇంజిన్ విషయానికొస్తే అపాచీ ఆర్‌టీఆర్ 160 4వీలో 159.7 సీసీ సింగిల్ సిలిండర్ ఇంజిన్ ఇచ్చారు. ఇందులో రెండు రైడింగ్ మోడల్‌లు ఉంటాయి. స్పోర్ట్ మోడ్‌లో 9600 ఆర్‌పీఎం వద్ద 17.6 హెచ్‌పీ పవర్‌ను, 7500 ఆర్‌పీఎం వద్ద 14.74 ఎన్‌ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. అర్బన్, రెయిన్ మోడ్‌లో 8650 ఆర్‌పీఎం వద్ద 15.6 హెచ్‌పీ పవర్‌ను, 7250 ఆర్‌పీఎం వద్ద 14.1 ఎన్‌ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది



## అందుకే ఎన్టీఆర్ 'డ్రాగన్'లో నేను నటించట్లేదు: టొవినో థామస్



టాలీవుడ్ హీరో ఎన్టీఆర్ (NTR) కన్నడ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో 'డ్రాగన్' (Dragon) సినిమా తెరకెక్కుతోంది. ఇందులో ఓ పాత్ర కోసం మలయాళ నటుడు టొవినో థామస్‌ని చిత్ర బృందం ఎంపిక చేయనున్నట్లు ఇటీవల వార్తలొచ్చిన సంగతి తెలిసిందే. వీటిపై టొవినో (Tovino Thomas) స్పందించారు. తన కొత్త సినిమా 'పళ్లిచట్టంబి' ప్రమోషన్స్‌లో భాగంగా మంగళవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో క్లారిటీ ఇచ్చారు. మలయాళంలో వేరే సినిమాలు చేస్తుండటంతో.. డేట్స్ సర్దుబాటు కాక 'డ్రాగన్'లో నటించట్లేదని తెలిపారు. ''తెలుగు సినిమాల్లో నటించాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నా. మలయాళంలో వర్కింగ్ కల్చర్ టాలీవుడ్‌కు భిన్నంగా ఉంటుంది. తక్కువ సమయంలోనే షూటింగ్ పూర్తి చేస్తాం. తెలుగు చిత్రాల షూటింగ్ షెడ్యూల్స్ ఎక్కువ ఉంటాయి. పైగా ఒకేసారి రెండు/మూడు చిత్రాల్లో నటించడం నాకు ఇష్టం ఉండదు. ఒక సినిమా పూర్తయ్యాకే మరో సినిమా చేస్తుంటా. ఒకవేళ నేను టాలీవుడ్‌లో ఓ పెద్ద సినిమాలో నటిస్తే.. నేను అంగీకరించిన మూడు/నాలుగు మలయాళ చిత్రాలపై ప్రభావం పడుతుంది. అందుకే తెలుగు సినిమాల్లో నటించలేకపోతున్నా'' అని వివరించారు. 15 ఏళ్ల కెరీర్‌లోనే 55కిపైగా సినిమాల్లో నటించడం గురించి చెబుతూ.. ''కెరీర్ తొలినాళ్లలో ఇతర హీరోల సినిమాల్లో చిన్న పాత్రలు పోషించేవాడిని. 2014లో లీడ్‌రోల్ చేసిన మూవీ విడుదలైంది. ఆ తర్వాత కూడా క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, విలన్‌గా నటిస్తూనే ఉన్నా. ఒకవేళ హీరోగానే చేయాలి అని ఫిక్స్ అయి ఉంటే ఇన్ని సినిమాలు వచ్చి ఉండేవి కాదు'' అని అన్నారు. డిజో జోస్ ఆంటోనీ దర్శకత్వం వహించిన 'పళ్లిచట్టంబి' (Pallichattambi) ఏప్రిల్ 10న తెలుగులోనూ విడుదల కానుంది.




## నయనతార.. ఆ రూమర్లు నిజమాయె

బాలీవుడ్ ప్రముఖ నటుడు సల్మాన్‌ఖాన్ (Salman Khan) హీరోగా టాలీవుడ్ దర్శకుడు వంశీ పైడిపల్లి ఓ సినిమాని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో హీరోయిన్‌గా నయనతార (Nayanthara)ను ఎంపిక చేసినట్లు రూమర్లు చక్కర్లు కొట్టాయి. చిత్ర బృందం అధికారిక ప్రకటనతో అవి నిజమయ్యాయి. 'క్వీన్ వచ్చింది' అంటూ శ్రీ వేంకటేశ్వర క్రియేషన్స్ నిర్మాణ సంస్థ సోషల్ మీడియాలో పోస్టు పెట్టింది. (SalmanKhan VamshiPaidipally Film). నయనతార రెండు దశాబ్దాలుగా పైగా హీరోయిన్‌గా కొనసాగుతుండటం విశేషం. ఇప్పటికే 75కుపైగా చిత్రాల్లో నటించిన ఆమె.. ఈ సంక్రాంతికి రిలీజై, మంచి విజయం అందుకున్న 'మన శంకరవరప్రసాద్'లో చిరంజీవికి జోడీగా నయన్ అలరించారు. మరోవైపు, నయన్ నటించిన మలయాళ సినిమా తెలుగులోనూ ఏప్రిల్ 23న విడుదల కానుంది. 'బృందావనం', 'ఎవడు', 'మహర్షి' చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడే వంశీ పైడిపల్లి. కోలీవుడ్ హీరో విజయ్‌తో ఆయన తెరకెక్కించిన 'వారిసు' 2023 సంక్రాంతికి విడుదలై, సందడి చేసింది. కొంత విరామం అనంతరం సల్మాన్‌తో సినిమా చేస్తున్నారు. ఏప్రిల్‌లో షూటింగ్ ప్రారంభం కానుంది.

## నా డ్రీమ్ అదే.. రాకాస ఈవెంట్‌లో నిహారిక



మెగా డాటర్ నిహారిక నటిగా రాణిస్తూనే నిర్మాతగా కూడా దూసుకెళ్తున్నారు. కమిటీ కుర్రోళ్లు మూవీ తర్వాత నిర్మాతగా బిజీ అయిపోయారు. ప్రస్తుతం తన సొంతం బ్యానర్ పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్‌పై రాకాస అనే మూవీని నిర్మించారు. సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా వస్తోన్న ఈ చిత్రానికి మానస శర్మ దర్శకత్వం వహించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తయిన ఈ చిత్రం ఏప్రిల్ 03న థియేటర్లలో సందడి చేయనుంది. తాజాగా ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవెంట్‌కు హాజరైన నిహారిక నిర్మాతగా తన అనుభవాలను పంచుకుంది. ఇలాంటి సినిమా తీస్తున్నామనగానే చాలామంది సలహాలు ఇచ్చారని తెలిపింది. వీఎఫ్ఎక్స్ విషయంలో పెద్ద పెద్ద సినిమాలే కష్టపడాల్సి వస్తోంది.. మీది చిన్న బడ్జెట్ సినిమా.. చాలా ఇబ్బంది పెడతారు చూసుకోండని నాతో చెప్పారని గుర్తు చేసుకుంది. ఏం చేసినా మాటలు అనే వాళ్లు అంటూనే ఉన్నారు. అందుకే నేను చేయాలనుకున్నది చేస్తూనే ఉంటానని తెలిపింది. ఓ మంచి సినిమా తీశాం.. జనాల్లోకి తీసుకెళ్లడానికి బాగా ప్రమోట్ చేస్తున్నామని నిహారిక వెల్లడించింది. ఇంటింటికి వెళ్లి సినిమా చూపించడానికి కూడా రెడీగా ఉన్నామని నిహారిక పేర్కొంది. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్‌లో భాగమైన ప్రతి ఒక్కరికీ సొంతిల్లు, కారు ఉండాలని ఆశిస్తున్నట్లు నిహారిక తన డ్రీమ్‌ను బయటపెట్టింది. కమిటీ కుర్రోళ్లు మూవీతో 11 మంది కొత్త వాళ్లను పరిచయం చేశానని నిహారిక తెలిపింది.

## 'ధురంధర్'ను దాటేసిన 'ధురంధర్ 2.. కర్ణాటకలో సరికొత్త రికార్డు




వసూళ్ల విషయంలో 'ధురంధర్'ను 'ధురంధర్ 2' (Dhurandhar 2) దాటేసింది. 12 రోజుల్లోనే ఫస్ట్ పార్ట్‌ను మించిన కలెక్షన్లు రాబట్టింది. ఈ నెల 19న బాక్సాఫీసు ముందుకొచ్చిన 'ధురంధర్: ది రివెంజ్' ఇప్పటి వరకూ రూ.1390+ కోట్లు (గ్రాస్) (Dhurandhar 2 Collections) వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాలు పేర్కొన్నాయి. గతేడాది విడుదలైన 'ధురంధర్' లైఫ్‌టైమ్ కలెక్షన్లు: రూ.1350+ కోట్లు (గ్రాస్). అత్యధిక వసూలు చేసిన భారతీయ చిత్రాల జాబితాలో నిన్నటి వరకూ 'ధురంధర్' నాలుగో స్థానంలో ఉండగా.. ఇప్పుడా స్థానంలో 'ధురంధర్ 2' చేరింది. రూ.2000+ కోట్లతో తొలిస్థానంలో 'దంగల్' ఉండగా.. తదుపరి స్థానాల్లో 'బాహుబలి 2' (రూ.1810+ కోట్లు), 'పుష్ప 2' (రూ.1800+ కోట్లు) ఉన్న సంగతి తెలిసిందే. 12 రోజుల్లోనే టాప్ 4లోకి వచ్చిన 'ధురంధర్ 2'.. టాప్ 3కి చేరాలంటే దాదాపు రూ.400 కోట్లు రాబట్టాలి. హీరో రణ్‌వీర్ సింగ్ సహా ఇందులో నటించిన వారికి, దర్శకుడు ఆదిత్యధర్‌ల క్రేజ్ అమాంతం పెరిగింది.

కర్ణాటకలో ఇలా..

కర్ణాటకలో రూ.100+ కోట్లు కలెక్ట్ చేసిన తొలి హిందీ సినిమాగా 'ధురంధర్ 2' సరికొత్త రికార్డు నెలకొల్పింది (Dhurandhar 2 record in Karnataka). ప్రపంచవ్యాప్తంగా కేవలం హిందీలోనే విడుదలైన 'ధురంధర్' రూ.1350+ కోట్లు రాబట్టడం ఓ రికార్డు అయితే.. పార్ట్ 1, పార్ట్ 2 చిత్రాలు అత్యధిక వసూలు చేసిన సినిమాల జాబితాలో ముందు వరుసలో నిలవడం మరో రికార్డు. ఈ అరుదైన రికార్డు మరే సినిమాకీ దక్కలేదు. దంగల్‌ను మినహాయిస్తే.. 'బాహుబలి 2', 'పుష్ప 2', 'ధురంధర్ 2' ఒకే కోవలోకి వస్తాయి. అదే సీక్వెల్. రెండు భాగాలుగా తీసినా.. నిడివి ఎక్కువైనా బలమైన కంటెంట్‌ను ప్రేక్షకులు ఆదరిస్తారన్నది మరోసారి రుజువైంది.

## ఫాంటసీ థ్రిల్లర్‌లో స్వీటీ.. ట్రైలర్ చూశారా?

బాహుబలి సినిమాలతో పాన్ ఇండియా క్రేజ్ సొంతం చేసుకున్న అనుష్క శెట్టి.. బరువు సమస్యల కారణంగా తర్వాత మూవీస్ చేయడం చాలా తగ్గించేసింది. అప్పుడో ఇప్పుడో అన్నట్లు చేస్తూ వస్తోంది. 2023లో 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి'తో హిట్ అందుకున్న ఈ హీరోయిన్.. గతేడాది 'ఘాటీ'తో ఘోరమైన డిజాస్టర్ చవిచూసింది. ఇప్పుడు 'కథనార్' అనే మలయాళ చిత్రంతో వచ్చేందుకు సిద్ధమైంది.

ఫాంటసీ థ్రిల్లర్ స్టోరీతో తీసిన ఈ సినిమాని తెలుగు, తమిళంలోనూ రిలీజ్ చేయనున్నారు. తాజాగా ఈ చిత్ర ట్రైలర్ విడుదల చేశారు. ఇందులో అనుష్కకి రెండు మూడు షాట్స్‌కి మాత్రమే పరిమితం చేశారు. విజువల్స్ బాగున్నాయి గానీ కాన్సెప్ట్ అర్థమై అర్థం కానట్లు అనిపించింది. డబ్బింగ్‌లో ఉపయోగించిన తెలుగు పదాలు కూడా సగటు ప్రేక్షకుడికి అర్థం కాని విధంగా ఉన్నాయి.

జయసూర్య హీరోగా నటించిన ఈ చిత్రంలో అనుష్క శెట్టి హీరోయిన్. ప్రభుదేవా, శాండీ మాస్టర్, వినీత్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ ఏడాది జూలై ఆగస్టులో థియేటర్లలోకి మూవీ రానుందని తెలుస్తోంది. రోజిన్ థామస్ దర్శకుడు. అనుష్కకి ఇది 50వ మూవీ కావడం విశేషం.



## అలా అయితేనే నేను సినిమా చేయగలను : రాజశేఖర్



శర్వానంద్ హీరోగా నటింటిన తాజా చిత్రం 'బైకర్'. అభిలాష్ రెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సీనియర్ హీరో రాజశేఖర్ కీలక పాత్ర పోషించారు. ఏప్రిల్ 3న ఈ సినిమా థియేటర్స్‌లో విడుదల కానుంది. ఈ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా తాజాగా రాజశేఖర్ మీడియాతో ముచ్చటించారు. ఆ విశేషాలు.. చాలా రోజుల తర్వాత నేను చేసిన సినిమా రిలీజ్ అవుతోంది. నేను బాగా ఇష్టపడి చేసిన సినిమా బైకర్. ఎప్పుడు ఏప్రిల్ 3 వస్తుందా అని ఎదురు చూస్తున్నాను. రిలీజ్ డేట్ దగ్గర పడుతున్న కొద్ది చాలా ఆనందంగా ఉంది. నేను నటించిన సినిమా ఇది. నా సినిమాలానే ఎప్పుడు రిలీజ్ అవుతుంది? ఆడియన్స్ ఎంతలా మెచ్చుకుంటారు? అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. నేను ఏ క్యారెక్టర్ చేసిన అది బాగుండాలి, నాకు నచ్చాలి. అప్పుడే నేను చేయగలుగుతాను. అలాగే క్యారెక్టర్ బాగుంటే సరిపోదు. సినిమా కూడా అద్భుతంగా ఆడాలి. కథ బాగుండాలి. నేను బైకర్ కథ విన్నప్పుడు నా క్యారెక్టర్, కథ రెండు నచ్చే ఈ సినిమా చేశాను. బైకర్ కథ పరంగా సూపర్ గా హిట్ అవుతుంది. అలాగే నా క్యారెక్టర్ కూడా అద్భుతంగా వచ్చింది. సినిమా రిలీజ్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను. నాకు చిన్నప్పటినుంచి బైక్స్ అంటే చాలా ఇష్టం. మా అమ్మమ్మగారింట్లో ఒక బుల్లెట్ బండి ఉండేది. నేను సెలవుల్లో అక్కడికి వెళ్ళిన ప్రతిసారి ఆ ఊరు మొత్తం బుల్లెట్లో తిరిగేవాడిని. ఆ తర్వాత బైక్స్ మీద ఆసక్తి పెరుగుతూ వచ్చింది. శేషు సినిమా సమయంలో స్వయంగా నేనే యమహా సిక్స్ ఫిఫ్టీ సిసి బండి కొనుక్కొని ఆ షూటింగ్ కి వాడడం జరిగింది. ఆ తర్వాత అదే బైక్ ని రోజు నడుపుకునేవాడిని. నేను నడిపే విధానం చూసి 'మీరు చాలా రిస్క్ తో నడుపుతున్నారని నాకు తెలియకుండానే జీవిత ఆ బైక్ అమ్మేశారు (నవ్వుతూ). అభిలాష్ గారు చాలా మంచి డైరెక్టర్. ఒక యాక్టర్ నుంచి ఎలాంటి పర్ఫార్మెన్స్ కావాలో ఆయనకి చాలా క్లారిటీ ఉంటుంది. ఆయన కథ మీద క్యారెక్టర్ మీద చాలా గ్రిప్ ఉన్నా దర్శకుడు . ఆయన అనుకునది వచ్చేంత వరకు ఎక్కడ కూడా రాజీపడరు. చాలా ఇన్వాల్వ్మెంట్ ఉన్న డైరెక్టర్. ఇందులో బైక్ రేసింగ్ సీన్స్ అద్భుతంగా ఉంటాయి. ఒక హాలీవుడ్ రేంజ్ సినిమాలా ఉంటుంది. అలాగే ఫాదర్ సన్ ఎమోషన్ కూడా అద్భుతంగా ఉంటుంది. చాలా సెంటిమెంట్ సీన్స్ ఉన్నాయి. నా కుటుంబమే నా బలం. ఈ సినిమా, నా క్యారెక్టర్ ఇంత అద్భుతంగా రావడానికి ఒక కారణం జీవిత, మా పిల్లలు. వాళ్ల సపోర్టు చాలా గొప్పది. ఈ సినిమా నేను చేసినప్పుడు నన్ను స్కూల్ కి డ్రాప్ చేసి మళ్లీ అక్కడి నుంచి తీసుకొచ్చే ఒక మదర్ లాగా చూసుకున్నారు. కొత్త సినిమాల విషయాలకొస్తే..పవన్ సాదినేనితో 'మగాడు' అనే సినిమా చేస్తున్నాను. అది ఇంకా 20% మిగిలింది. నెక్స్ట మంత్ నుంచి షూటింగ్ అనుకుంటున్నారు.

అలాగే నేను రమ్య విశ్వదేవ్ శివాని కలిసి ఒక సినిమా చేస్తున్నాం. అది షూటింగ్ జరుగుతుంది త్వరలోనే టైటిల్ రిలీజ్ చేస్తాం. బైకర్ తో పాటు ఈ రెండు సినిమాలు కూడా కచ్చితంగా నా కెరీర్లో చాలా మంచి సినిమాలు అవుతాయని నమ్మకం ఉంది.



# నోట్‌బుక్ సెలబ్రేషన్స్..
# నన్నెవరూ ఆపలేరు: దిగ్వేశ్ రాఠీ

నోట్ బుక్ సెలబ్రేషన్స్ గుర్తున్నాయా? ఐపీఎల్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ బౌలర్ దిగ్వేశ్ రాఠీ వికెట్ తీసిన ప్రతిసారి ఏదో సిగ్నేచర్ చేస్తున్నట్లు సంబరాలు చేసుకొనేవాడు. దీనిపై గతేడాది ఐపీఎల్‌లోనూ అభిషేక్ శర్మతో కాస్త ఘర్షణ వాతావరణమూ తలెత్తింది. పలుమార్లు జరిమానాను ఎదుర్కొన్న అతడు.. ఒక మ్యాచ్ సస్పెన్షన్‌కు గురైన సంగతి తెలిసిందే. ఆ తర్వాత దేశవాళీలోనూ అదే తీరుతో వ్యవహరించిన అతడు వివాదాస్పదంగా మారాడు. ఇప్పుడు మళ్లీ ఐపీఎల్‌లో ఆడుతున్న నేపథ్యంలో తన పంథాను మార్చుకొనేది లేదని రాఠీ స్పష్టం చేశాడు. 'నేను ఇక్కడ ఏ ప్లేయర్‌నూ అవమానించడం లేదు. నా ఉద్దేశం కూడా అది కాదు. ఎవరూ కూడా నా సంబరాలను ఆపలేరు. ఏ బ్యాటరైనా సెంచరీ చేసిన తర్వాత బ్యాట్‌పై తమ హెల్మెట్ పెట్టుకొని సెలబ్రేట్ చేసుకుంటారు కదా.. అలాగే నేను కూడా ఇలా సంబరపడతా. రిషభ్ పంత్ భాయ్, మేనేజ్‌మెంట్ మాత్రం ఒక సూచన చేశారు. నేను స్పెషల్ సెలబ్రేషన్ చేసుకున్నా.. నిషేధం మాత్రం పడకుండా చూసుకోమన్నారు'' అని రాఠీ తెలిపాడు. ఒకే సీజన్‌లో మూడుసార్లు ఉల్లంఘనలకు పాల్పడినందుకు రాఠీపై భారీ జరిమానా పడింది. తొలుత 25 శాతం జరిమానా.. తదుపరి రెండుసార్లు 50 శాతం చొప్పున ఫైన్ పడింది. ఒక మ్యాచ్ నిషేధం కూడా ఎదుర్కొన్నాడు. ఐపీఎల్ నిబంధనల ప్రకారం.. రాఠీ ఖాతాలో ఒక డీమెరిట్ పాయింట్ కూడా పడింది. నాలుగు డీమెరిట్ పాయింట్లు జతైతే.. ఒక సస్పెన్షన్ పాయింట్‌కు సమానం. ఆ మార్క్‌కు చేరుకుంటే మాత్రం మ్యాచ్ నిషేధం పడినట్లే. 36 నెలల వ్యవధిలో 8 డీమెరిట్ పాయింట్లు అందుకొంటే రెండు మ్యాచుల నిషేధం, 11 పాయింట్లు వస్తే మూడు మ్యాచుల్లో బ్యాన్ అయ్యే ప్రమాదం ఉంది.

# గెలుపు పంజా విసిరిన పంజాబ్..

**పంజాబ్ కింగ్స్‌ను గెలిపించిన కూపర్ కనోలీ**

**44 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్స్‌లతో 72 నాటౌట్**

**3 వికెట్లతో గుజరాత్ టైటాన్స్ ఓటమి**

**గుజరాత్ టైటాన్స్‌తో మ్యాచ్‌లో 163 పరుగుల విజయలక్ష్యం.... పంజాబ్ ఒకదశలో 11 ఓవర్లలో 110/2... మిగిలిన 48 బంతుల్లో మరో 53 పరుగులు అంటే అలవోకగా ఛేదించవచ్చు... కానీ ఇక్కడ జట్టు అనూహ్యంగా తడబడింది. 16 బంతుల వ్యవధిలో జట్టు 4 వికెట్లు కోల్పోవడంతో ఒక్కసారిగా ఉత్కంఠ పెరిగింది. అయితే ఈ మ్యాచ్‌తోనే ఐపీఎల్‌లో అరంగేట్రం చేసిన ఆస్ట్రేలియన్ కూపర్ కనోలీ పట్టుదలగా నిలబడ్డాడు. ఒత్తిడిని అధిగమిస్తూ చివరి వరకు నిలబడి ఒంటి చేత్తో గెలిపించాడు. అంతకుముందు పంజాబ్ పదునైన బౌలింగ్ ముందు నిలవలేక గుజరాత్ సాధారణ స్కోరుకే పరిమితమైంది.**



న్యూ చండీగఢ్: ఐపీఎల్‌లో మూడు ఏకపక్ష మ్యాచ్‌ల తర్వాత ఉత్కంఠభరిత పోరు జరిగింది. మంగళవారం చివరి వరకు ఆసక్తికరంగా సాగిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ 3 వికెట్ల తేడాతో గుజరాత్ టైటాన్స్‌పై విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. శుభ్‌మన్ గిల్ (27 బంతుల్లో 39; 6 ఫోర్లు), జోస్ బట్లర్ (33 బంతుల్లో 38; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఫర్వాలేదనిపించారు. అనంతరం పంజాబ్ 19.1 ఓవర్లలో 7 వికెట్లకు 165 పరుగులు సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కూపర్ కనోలీ (44 బంతుల్లో 72 నాటౌట్; 5 ఫోర్లు, 5 సిక్స్‌లు) చెలరేగగా, ప్రభ్‌సిమ్రన్ సింగ్ (24 బంతుల్లో 37; 1 ఫోర్, 4 సిక్స్‌లు) రాణించాడు.

**బ్యాటింగ్ వైఫల్యం!**

బార్ట్‌లెట్ ఓవర్లో గిల్ మూడు ఫోర్లు కొట్టి ధాటిని ప్రదర్శించగా, మరో ఓపెనర్ సాయిసుదర్శన్ (13) ఎక్కువసేపు నిలవలేకపోయాడు. బట్లర్ కూడా ఆశించిన స్థాయిలో దూకుడుగా ఆడకపోవడంతో పవర్‌ప్లేలో గుజరాత్ 54 పరుగులే చేయగలిగింది. ఇందులో ఒక్క సిక్స్ కూడా లేకపోవడం విశేషం. ఆ తర్వాత చహల్ బౌలింగ్‌లో స్లాగ్ స్వీప్‌కు ప్రయత్నించి గిల్ వెనుదిరగ్గా, గ్లెన్ ఫిలిప్స్ (17 బంతుల్లో 25; 1 ఫోర్, 1 సిక్స్) కూడా ఎక్కువసేపు నిలవలేదు. 16వ ఓవర్ వరకు క్రీజ్‌లో ఉన్నా బట్లర్ ప్రభావం కనిపించలేదు. చివరి 4 ఓవర్లలో టైటాన్స్ కేవలం 2 ఫోర్లతో 31 పరుగులే రాబట్టగలిగిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మిడిలార్డర్‌లో వాషింగ్టన్ సుందర్ (18), షారుఖ్ ఖాన్ (4) కూడా విఫలమయ్యారు.

**రాణించిన ప్రభ్‌సిమ్రన్...**

ఛేదనలో ఆరంభంలోనే ప్రియాన్ష్ ఆర్య (7) వెనుదిరిగినా... ప్రభ్ సిమ్రన్ సిక్సర్లతో చెలరేగాడు. రబాడ ఓవర్లో వరుసగా రెండు సిక్స్‌లు కొట్టిన అతను, సుందర్ బౌలింగ్‌లో మరో రెండు భారీ సిక్స్‌లు బాదాడు. అయితే కీలక సమయంలో గుజరాత్ కట్టుదిట్టమైన బౌలింగ్‌తో వరుస వికెట్లు తీసి పంజాబ్‌పై ఒత్తిడి పెంచింది. కానీ కనోలీ పోరాటంతో మ్యాచ్ పంజాబ్ వశమైంది.

**అశోక్ అరంగేట్రం...**

రాజస్తాన్‌కు చెందిన 23 ఏళ్ల అశోక్ శర్మ ఈ మ్యాచ్‌తోనే ఐపీఎల్‌లో అడుగు పెట్టాడు. దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా గంటకు 150 కిలోమీటర్లకు పైగా వేగంతో బౌలింగ్ చేసే ఫాస్ట్ బౌలర్‌గా గుర్తింపు పొందాడు. ఇటీవల సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో కేవలం 15.63 సగటుతో 22 వికెట్లు పడగొట్టి టోర్నీ టాపర్‌గా నిలిచాడు. ఐపీఎల్‌లో 2022లో కోల్‌కతా, 2025లో రాజస్తాన్ జట్లలో ఉన్నా ఒక్క మ్యాచ్ కూడా ఆడే అవకాశం రాలేదు.

**స్కోరు వివరాలు**

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సుదర్శన్ (సి) అయ్యర్ (బి) యాన్సెన్ 13; గిల్ (సి) కనోలీ (బి) చహల్ 39; బట్లర్ (సి) బార్ట్‌లెట్ (బి) చహల్ 38; ఫిలిప్స్ (సి) యాన్సెన్ (బి) వైశాక్ 25; సుందర్ (సి) అర్ష్‌దీప్ (బి) వైశాక్ 18, షారుఖ్ (సి) అర్ష్‌దీప్ (బి) వైశాక్ 4; తెవాటియా (నాటౌట్) 11; రషీద్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 14; మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 162. వికెట్ల పతనం: 1-37, 2-83, 3-119, 4-129, 5-144, 6-150.

బౌలింగ్: అర్ష్‌దీప్ 4-0-42-0, బార్ట్‌లెట్ 4-0-36-0, యాన్సెన్ 4-0-20-1, వైశాక్ 4-0-34-3, చహల్ 4-0-28-2,

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రియాన్ష (సి) అశోక్ (బి) రబాడ 7; ప్రభ్‌సిమ్రన్ (సి) ప్రసిధ్ (బి) రషీద్ 37; కనోలీ (నాటౌట్) 72; శ్రేయస్ (సి) సుందర్ (బి) ప్రసిధ్ 18; వధేరా (సి) గిల్ (బి) సుందర్ 3; శశాంక్ (సి) బట్లర్ (బి) ప్రసిధ్ 4; స్టొయినిస్ (సి) రషీద్ (బి) ప్రసిధ్ 0; యాన్సెన్ (సి) గిల్ (బి) అశోక్ 9; బార్ట్‌లెట్ (నాటౌట్) 11; ఎక్స్‌ట్రాలు 4; మొత్తం (19.1 ఓవర్లలో 7 వికెట్లకు) 165.

వికెట్ల పతనం: 1-7, 2-83, 3-110, 4-113, 5-118, 6-118, 7-144. బౌలింగ్: సిరాజ్ 2-0-15-0 రబాడ 3-0-34-1, అశోక్ శర్మ 3-0-31-1, రషీద్ 4-0-29-1, సుందర్ 3.1-0-27-1, ప్రసిధ్ 4-0-29-3.

**తొలి మ్యాచ్‌లోనే కనోలీ జోరు...**

పంజాబ్ కింగ్స్ తరఫున బరిలోకి దిగిన ఆస్ట్రేలియా క్రికెటర్ కూపర్ కనోలీకి ఇదే తొలి ఐపీఎల్ మ్యాచ్. ఆల్‌రౌండర్‌గా గుర్తింపు ఉన్నా వెన్ను గాయం కారణంగా లీగ్‌లో అతను బౌలింగ్ చేయడని, స్పెషలిస్ట్ బ్యాటర్‌గానే ఆడతాడని పంజాబ్ ప్రకటించింది. దానికి న్యాయం చేస్తూ కనోలీ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. రబాడ బౌలింగ్‌లో భారీ సిక్స్ కొట్టిన అతను అశోక్ ఓవర్లో 6, 4 బాదాడు. రషీద్ ఓవర్లోనూ సిక్స్ కొట్టిన కనోలీ 34 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించాడు.

**బట్లర్ ఇలా ఎలా..!**

టి20 క్రికెట్‌లో విధ్వంసకర బ్యాటర్లలో ఒకడిగా గుర్తింపు...ఇంగ్లండ్‌కు టి20 వరల్డ్ కప్ అందించిన కెప్టెన్... ఐపీఎల్‌లో ఏడు సెంచరీలు సహా నాలుగు వేలకు పైగా పరుగులు, ఏడు సీజన్ల పాటు రాజస్తాన్ రాయల్స్ విజయాల్లో కీలక పాత్ర... గత ఏడాది కూడా గుజరాత్ తరఫున 163 స్ట్రయిక్ రేట్‌తో 538 పరుగులు... కానీ ఇప్పుడు బట్లర్ ఒక్కో పరుగు కోసం శ్రమిస్తున్నాడు. బౌండరీలు కాదు కదా సింగిల్ తీయడమే కష్టంగా మారిపోయింది! ఇటీవల టి20 వరల్డ్ కప్‌లో అతను చూపించిన పేలవ ప్రదర్శన ఇక్కడా కొనసాగింది.

వరల్డ్ కప్‌లో 8 ఇన్నింగ్స్‌లలో కలిపి 87 పరుగులే చేసిన అతను ఐదు సార్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యాడు. నిజానికి రెండేళ్లుగా అంతర్జాతీయ క్రికెట్‌లో బట్లర్ ఆట ఏమాత్రం బాగా లేదు. గత నాలుగు ఐసీసీ టోర్నీల్లో కలిపి (రెండు టి20 వరల్డ్ కప్‌లు, వన్డే వరల్డ్ కప్, చాంపియన్స్ ట్రోఫీ) ఇంగ్లండ్ తరఫున 28 ఇన్నింగ్స్‌లలో బట్లర్ ఒకే ఒక అర్ధసెంచరీ చేశాడంటే పరిస్థితి అర్థమవుతుంది. అయితే ఐపీఎల్‌కు వచ్చేసరికి అన్నీ వెనక్కి తోసి మళ్లీ ఫామ్‌లోకి వచ్చి చెలరేగుతాడని ఆశించిన టైటాన్స్‌కు తొలి మ్యాచ్‌లోనే నిరాశ ఎదురైంది. పంజాబ్‌తో మ్యాచ్‌లో క్రీజ్‌లో ఉన్నంతసేపు బట్లర్ చాలా ఇబ్బందిగా కనిపించాడు.

అసలు ఏమాత్రం సాధికారికంగా ఆడలేకపోయాడు. తన తొలి 30 బంతుల్లో అతను 11 డాట్ బాల్స్ ఆడాడు. ఆ తర్వాత లెక్క సరి చేసేందుకు అతను చాలా శ్రమించాడు. స్వీప్, రివర్స్ స్వీప్‌లు ప్రయత్నించినా ఆశించిన ఫలితం మాత్రం రాలేదు. చివరకు చహల్ బౌలింగ్‌లో వరుసగా రెండు డాట్ బాల్స్ తర్వాత అసహనంతో భారీ షాట్‌కు ప్రయత్నించి అతను వెనుదిరిగాడు. కేవలం 115.15 స్ట్రయిక్‌రేట్‌తో ఇన్నింగ్స్ ముగించడం బట్లర్ స్థాయికి తగింది కాదు!

# అప్పటినుంచి ధోనీతో మాట్లాడలేదు: కారణం చెప్పిన జడేజా



ఐపీఎల్ 19లో చెన్నై సూపర్‌కింగ్స్‌ను రాజస్థాన్ రాయల్స్ చిత్తు చేయడంలో రవీంద్ర జడేజా కీలక పాత్ర పోషించాడు. చెన్నైపై రెండు వికెట్ల ప్రదర్శన చేశాడు. 13 ఏళ్ల పాటు తాను ప్రాతినిధ్యం వహించిన జట్టుకు వ్యతిరేకంగా మైదానంలో దిగడం వింతగా అనిపించిందని అన్నాడు. అలాగే ధోనీతో మాట్లాడలేదని వెల్లడించాడు. రాజస్థాన్ విజయం అనంతరం జడేజా మాట్లాడుతూ.. సీఎస్‌కే నుంచి వెళ్లిపోయిన తర్వాత ధోనీ (MS Dhoni)తో మాట్లాడలేదని చెప్పాడు. ''మహీభాయ్ ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉంచుతాడు కాబట్టి అతడితో మాట్లాడలేదు'' అంటూ సరదాగా నవ్వేశాడు. ఇప్పుడు తాము మాట్లాడుకోలేదు కానీ.. కలిసినప్పుడల్లా అన్ని విషయాలు చర్చించుకుంటామన్నాడు. సుదీర్ఘకాలం ఒకేజట్టుతో కలిసి ప్రయాణించిన వీరి మధ్య మంచి స్నేహబంధం ఉంది.రాజస్థాన్‌తోనే కెరీర్ ఆరంభించిన జడ్డూ.. మళ్లీ ఇన్నేళ్లకు ఆ జట్టులోకి వచ్చి సర్ఫరాజ్ ఖాన్, శివమ్ దూబె వికెట్లు తీశాడు. ''పింక్ నాకు బాగానే ఉందనిపిస్తుంది. దూబె నాకు చాలాకాలంగా తెలుసు. అతడు భారీ షాట్లు ఆడతాడని తెలుసు. అందుకే ఆఫ్‌స్టంప్ అవతల బౌలింగ్ చేయడానికి ప్రయత్నించాను. గువాహటి పిచ్ బౌలింగ్‌కు బాగుండటంతో ఆటను ఆస్వాదించా'' అని వెల్లడించాడు. ఇదిలా ఉంటే.. గాయం కారణంగా ధోనీ రెండువారాలు ఆటకు దూరం కావడంతో అతడి ఆటను చూడాలనుకున్నవారికి నిరాశ ఎదురైంది. ఇక, యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ తనదైన శైలిలో చెలరేగడంతో.. చెన్నై కేవలం 127 పరుగులకే కుప్పకూలిన సంగతి తెలిసిందే.

# ఇంగ్లండ్ టూర్‌కు వైభవ్ సూర్యవంశీని పంపండి: మైకేల్ వాన్



భారత యువ సంచలనం, రాజస్తాన్ రాయల్స్ స్టార్ వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్ 2026 టోర్నీని ఘనంగా ఆరంభించాడు. చెన్నై సూపర్ కింగ్స్‌తో సోమవారం నాటి మ్యాచ్‌లో ఈ ఓపెనింగ్ బ్యాటర్ దుమ్మురేపాడు. మెరుపు అర్ధ శతకం బాది శెభాష్ అనిపించుకున్నాడు.

ప్రశంసల వర్షం

గువాహటి వేదికగా కేవలం 17 బంతుల్లోనే 52 పరుగులు సాధించాడు వైభవ్ సూర్యవంశీ (Vaibhav Suryavanshi). అతడి విధ్వంసకర ఇన్నింగ్స్‌లో నాలుగు ఫోర్లు, ఐదు సిక్సర్లు ఉన్నాయి. ఇక వైభవ్ ధనాధన్ ఇన్నింగ్స్ కారణంగా రాజస్తాన్ చెన్నైపై అలవోక విజయం సాధించింది. 128 పరుగుల నామమాత్రపు లక్ష్యాన్ని కేవలం 12.1 ఓవర్లలో రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది.

ఈ నేపథ్యంలో వైభవ్ సూర్యవంశీపై ప్రశంసల వర్షం కురుస్తోంది. ఇక ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైకేల్ వాన్ అయితే ఓ అడుగు ముందుకేసి.. వైభవ్‌ను వెంటనే టీమిండియాకు ఎంపిక చేయాలనే ప్రతిపాదన తెచ్చాడు. క్రిక్‌బజ్ షోలో మాట్లాడుతూ..

నేనే గనుక సెలక్టర్ అయి ఉంటే

''అతడు ఎప్పుడు టీమిండియా తరఫున అరంగేట్రం చేస్తాడు? అని నేనెంతో ఆతురతగా ఎదురుచూస్తున్నాను. ఇది కాస్త తొందరపాటే అని అనిపించవచ్చు. ఐపీఎల్ తాజా ఎడిషన్‌లో అతడికి ఇదే తొలి ఇన్నింగ్స్. ఏదేమైనా కొన్ని నెలల తర్వాత టీమిండియా ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లాల్సి ఉంది.ఒకవేళ నేనే గనుక సెలక్టర్ అయి ఉంటే వైభవ్‌ను ఈ టూర్‌కు కచ్చితంగా ఎంపిక చేస్తా. ప్రస్తుతానికి అతడికి జట్టులో చేరాల్సిన అవసరం లేకపోవచ్చు. కానీ జట్టుకు అతడి అవసరం ఉంటుందేమో!.. పదిహేనేళ్ల పిల్లాడిని టూర్‌కు అనుమతిస్తారా? అంటే నేనేమీ చెప్పలేను.కానీ అతడు ఇప్పటికే ఆటగాడిగా పరిణతి సాధించాడు. టీమిండియా తరఫున కూడా కచ్చితంగా సత్తా చాటగలడు'' అని మైకేల్ వాన్ పేర్కొన్నాడు. వీలైనంత త్వరగా వైభవ్‌ను జాతీయ జట్టుకు ఎంపిక చేయాలని భారత క్రికెట్ నియంత్రణ మండలి (BCCI)కి సూచించాడు.

# నేడు ఢిల్లీ క్యాపిటల్స్‌తో లక్నో సూపర్ జెయింట్స్ పోరు



లక్నో: ఐపీఎల్‌లో ఇప్పటి వరకు ఒక్కసారి కూడా ట్రోఫీ చేజిక్కించుకోలేకపోయిన ఢిల్లీ క్యాపిటల్స్, లక్నో సూపర్ జెయింట్స్ ఈ సీజన్‌ను విజయంతో ప్రారంభించేందుకు సిద్ధమయ్యాయి. గతేడాది ప్లే ఆఫ్స్‌కు చేరలేకపోయిన ఈ రెండు జట్లు బుధవారం తమ తొలి మ్యాచ్ ఆడనున్నాయి. రిషభ్ పంత్ సారథ్యంలోని లక్నో పేపర్‌పై భీకరంగా కనిపిస్తోంది. మార్ష్, మార్క్‌రమ్ ఓపెనింగ్ చేయనుండగా... పంత్, పూరన్, బదోనీ, షహబాజ్ మిడిలార్డర్‌లో బరిలోకి దిగనున్నారు.గత సీజన్‌లో ఆకట్టుకున్న స్పిన్నర్ దిగ్వేశ్ రాఠీ మరోసారి కీలకం కానుండగా... పేస్ బౌలింగ్‌లో షమీ, నోర్జే, అవేశ్ ఖాన్, మొహసిన్ ఖాన్, మయాంక్ యాదవ్ రూపంలో లెక్కకు మిక్కిలి ప్రత్యామ్నాయాలు ఉన్నాయి. మరోవైపు అక్షర్ పటేల్ సారథ్యంలోని ఢిల్లీ జట్టు కూర్పును సరిచేసుకునే పనిలో ఉంది. కేఎల్ రాహుల్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను ఆరంభించేదెవరో చూడాలి.మిల్లర్, నితీశ్ రాణా, సమీర్ రిజ్వీ, అశుతోష్ శర్మతో బ్యాటింగ్ బలంగానే ఉండగా... ఆసీస్ స్టార్ పేసర్ స్టార్క్ గాయం కారణంగా తొలి మ్యాచ్‌కు అందుబాటులో లేదు. దేశవాళీల్లో దుమ్మురేపుతున్న అఖీబ్ నబీపై అందరి దృష్టి నిలవనుంది. అక్షర్, కుల్దీప్ స్పిన్ భారం మోయనున్నారు. లీగ్‌లో ఇప్పటి వరకు ఇరు జట్లు ఏడుసార్లు తలపడగా... అందులో ఢిల్లీ నాలుగు మ్యాచ్‌లు నెగ్గగా... లక్నో మూడింట విజయం సాధించింది.

# సీఎస్‌కే ప్లేయర్లూ..
# ఆ సంకల్పం లేకపోతే ఎలా!



దూకుడుగా ఆడే బ్రెవిస్ జట్టులో లేడు.. అంతే రాజస్థాన్‌పై సెకండ్ డౌన్‌లో ఆదుకొనే నాథుడు లేకుండాపోయాడు.. ధోని రెండు వారాలు దూరం.. దీంతో రాయల్స్‌పై లోయర్ ఆర్డర్‌లో భారీ షాట్లతో విరుచుకుపడే బ్యాటర్ కరవయ్యాడు.

అదేంటి.. ఇద్దరు ఆటగాళ్లు లేనంత మాత్రాన మిగతా జట్టును తక్కువ చేయాలా? అనే అనుమానం కలగడం సహజం. ధోని ఉన్నప్పుడూ చెన్నై సూపర్ కింగ్స్ ఓడిపోలేదా? అని కొందరి వాదన. ఇక్కడ గెలుపోటములు కాదు.. ప్రత్యర్థిపై పైచేయి సాధించాలనే తలంపు లేకపోవడమే సీఎస్‌కే ప్రధాన లోపం. ప్రత్యర్థిని కట్టడి చేసే సరైన వ్యూహాలు అమలుచేయకపోవడం, విజయం సాధించాలనే సంకల్పం తీసుకోకపోవడమే ఓటమికి కారణాలుగా అనిపిస్తోంది. బౌలింగ్ ఆల్‌రౌండర్ అయిన జేమీ ఓవర్టన్ ఆఖర్లో కాస్త దూకుడుగా ఆడటంతో రాజస్థాన్ రాయల్స్ ముందు కనీసం 120+ లక్ష్యమైనా నిర్దేశించగలిగింది.

**ఆ బాధ్యత మీరు తీసుకోవాలి కదా..**

టాప్ ఆర్డర్‌లో నలుగురు బ్యాటర్లలో ఒక్కరు కూడా రెండంకెల స్కోరు చేయలేదంటే సీఎస్‌కే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుంది. భారీ అంచనాలతో చెన్నైకి వచ్చిన సంజు శాంసన్ తేలిపోయాడు. ఇక కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ 11 బంతులు ఎదుర్కొన్నా.. ఆరు పరుగులకే పరిమితం. కుర్రాడు ఆయుష్ మాత్రే డకౌట్.. బ్రెవిస్ లేని లోటును తీరుస్తాడని భావించిన మాథ్యూ షార్ట్ 2 పరుగులే చేయడంతో సీఎస్‌కే పీకల్లోతు కష్టాల్లో పడింది. జట్టులో ఓ నలుగురు మినహా.. మిగతావారంతా జూనియర్లే. అలాంటప్పుడు సంజు, రుతురాజ్, షార్ట్ ముందుండి జట్టును నడిపించాలి. కానీ, ఇక్కడ వారి విఫలం జట్టు ప్రదర్శనపై తీవ్ర ప్రభావం చూపించింది.

దూబె.. ఇలాగేనా?

టీ20 ప్రపంచకప్‌లో శివమ్ దూబె నుంచి అద్భుత ఇన్నింగ్స్‌లను చూసిన అభిమానులు.. చెన్నై సూపర్ కింగ్స్ తరఫునా అదే దూకుడును ఆశించారు. అదే సమయంలో జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకొంటాడని భావించారు. వచ్చీ రావడంతోనే సిక్స్‌తో తన ఉద్దేశం ఏంటో ప్రత్యర్థికి చెప్పినట్లు అనిపించింది. అయితే, అటువైపు రవీంద్ర జడేజా బౌలర్. అతడికీ సీఎస్‌కే సభ్యులు ఎలా ఆడతారో తెలుసు కదా.. అప్పటికి కేవలం ఎనిమిదో ఓవర్ మాత్రమే నడుస్తోంది. కాసేపు క్రీజ్‌లో సమయం గడపాల్సిన అవసరమూ ఉంది. ఎందుకంటే ఆ తర్వాత నాణ్యమైన బ్యాటర్ అనేవాడూ లేడు. ఓవర్టన్‌తో కలిసి దూబె ఇన్నింగ్స్‌ను చక్కదిద్ది ఉంటే.. సీఎస్‌కే పరిస్థితి భిన్నంగా ఉండేదేమో. కనీసం 170 పరుగులనైనా రాజస్థాన్ ముందు ఉంచుంటే ఫలితం వేరేగా ఉండేదని సీఎస్‌కే అభిమానులే చెబుతున్నారు. ధోని గైర్హాజరీలో అక్కడ నిలబడి ఆడితే దూబె విలువ బాగా పెరిగిపోయేది. కానీ, అలా జరగలేదు. మరో సిక్స్ కొడదామని భావించి వికెట్ సమర్పించాడు.

**క్యాచ్‌లు... ఫీల్డింగ్‌లోనూ**

తక్కువ లక్ష్యం ఉన్నప్పుడు ప్రతి పరుగును ఆపాలి. వచ్చిన ప్రతి క్యాచ్‌ను కష్టమైనా సరే అందుకోవాలి. కానీ, సీఎస్‌కే ఫీల్డర్లు ఆ జోష్ చూపించలేదు. ప్రమాదకర బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ తొలి ఓవర్‌లోనే ఇచ్చిన క్యాచ్‌ను కార్తిక్ శర్మ జారవిడిచాడు. సరే.. బంతి మిస్ అయింది కదా కనీసం బౌండరీ పోకుండా ఆపుదామనే ఆలోచనా చేయకపోవడం గమనార్హం. ఇటీవల అద్భుత ఫిట్‌నెస్ సాధించిన సర్ఫరాజ్ కూడా బంతిని ఆపడంలో ఇబ్బంది పడటం చూశాం. ఇవన్నీ సీఎస్‌కే ఓటమికి ప్రధాన కారణాలు.

చివరిగా: డేవాల్డ్ బ్రెవిస్ వచ్చే మ్యాచ్‌లో ఆడతాడో, లేదో తెలియదు. ధోని మాత్రం కనీసం ఇంకో ఐదు మ్యాచులకు దూరంగా ఉంటాడు. ప్లేఆఫ్స్ రేసులో నిలవాలంటే కనీసం 9 మ్యాచులు గెలవాలి. అంటే.. వీరిద్దరూ వచ్చేలోగా జరగబోయే మ్యాచుల్లో కొన్ని విజయాలు సాధిస్తేనే.. టాప్ 4లో ఉండేందుకు అవకాశాలు కాస్త మెరుగ్గా ఉంటాయి.



# పీఆర్ టీమ్ లేకపోవడమే అందుక్కారణం..
## ఆటను వదిలేదే లేదు: షమీ

''నాకు క్రికెట్‌పై బోర్ కొట్టాలి. అప్పటివరకూ ఆటను వదిలేది లేదు''.. ఇదీ వెటరన్ క్రికెటర్ మహ్మద్ షమీ తన రిటైర్‌మెంట్‌పై వస్తోన్న ప్రశ్నలకు ఇచ్చిన సమాధానం. ఐపీఎల్ 2026 సీజన్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ తరఫున బరిలోకి దిగనున్న షమీ.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడాడు. ఓ వైపు కుటుంబ వివాదాలు, మరోవైపు జాతీయజట్టులో స్థానం లేదు.. రిటైర్‌మెంట్ తీసుకోవాలంటూ సూచనలు.. ఇలా షమీని చుట్టుముట్టాయి. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా.. తనకు అప్పుడే రిటైర్‌మెంట్ తీసుకోవాలనే ఆలోచన లేదని స్పష్టంచేశాడు.'నేనెప్పుడైతే అలసిపోతానో.. ఆ రోజు నిర్ణయం తీసుకుంటా. ప్రస్తుతం నాకు రిటైర్‌మెంట్ ఆలోచనే లేదు. ఒకవేళ అలాంటి ఆలోచనలు వచ్చాయంటే.. ఆత్మవిశ్వాసం సన్నగిల్లుతుంది. ఇంతకుముందు కూడా నేను ఇదే విషయం గురించి చెప్పా. నిద్ర నుంచి లేచి అరే.. ఇవాళ క్రికెట్ ఆడలేనని అనుకున్నరోజు ఆటకు గుడ్‌బై చెప్పేస్తా. ఇప్పటివరకు నాకు అలాంటి ఉద్దేశం రాలేదు. ఆటను ఆస్వాదిస్తున్నా. సానుకూల దృక్పథంతో ముందుకుసాగుతా. బౌలర్‌గా.. నేనెప్పుడూ వంద శాతం ఇచ్చేందుకు ప్రయత్నిస్తా. నాపై ఉన్న అంచనాలను అందుకొనేందుకు చూస్తా. నా బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించేందుకు ప్రయత్నిస్తా. నిబద్ధతతో ఆడతా. మిగతాది నా చేతుల్లో ఉండదు'' అని షమీ వెల్లడించాడు.

''టీ20ల్లోనూ మంచి ప్రదర్శనే చేశా. ఐపీఎల్‌లోనూ గొప్ప రికార్డులే ఉన్నాయి. కానీ, ఇప్పటికీ నన్ను నాణ్యమైన టీ20 బౌలర్‌గా చాలామంది గుర్తించరు. అంతకుముందు ప్రతి సీజన్‌లోనూ కనీసం 20కి పైగా వికెట్లు తీశా. అయినా సరే, టీమ్‌ఇండియా మేనేజ్‌మెంట్ నన్ను పొట్టి ఫార్మాట్ బౌలర్‌గా పరిగణించలేదు. జాతీయ జట్టులోకి ఎందుకు తీసుకోలేదో అర్థంకాలేదు. సరైన పీఆర్ టీమ్ లేకపోవడమే అందుక్కారణమేమో. కొత్త కోచ్ వచ్చాక నాకు అవకాశాలు రావడం లేదు. నేను నచ్చలేదో.. నా బౌలింగ్‌పై నమ్మకం లేదో తెలియదు. ఆ విషయంలో నాకెవరూ క్లారిటీ ఇవ్వడం లేదు'' అని షమీ పేర్కొన్నాడు.